RNI NO .TGTEL/25/A4366

E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు  జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం :

9959812941-9949356387

PUBLISHED: TELANGANA  సంపుటి :01  సంచిక :02  ఆదివారం 07 డిసెంబర్ ,2025  ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్  పేజీలు: 08  వెల :05/-


## సుప్రీంకోర్టుకు చేరిన ఇండిగో సంక్షోభం.. సర్వీసుల రద్దుపై పిటిషన్ దాఖలు



ఇండిగో ఫ్లైట్ సర్వీసుల రద్దు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దేశంలోని ఎయిర్‌పోర్టులన్నీ ప్రయాణికుల నిరసనలతో హోరెత్తిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇండిగో విమాన సర్వీసుల రద్దుపై దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు లో పిటిషన్ దాఖలైంది. సమస్య జటిలమైన నేపథ్యంలో తక్షణమే విచారణ చేపట్టాలని పిటిషనర్ ధర్మాసనాన్ని అభ్యర్థించారు. దీంతో ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేయడానికి వీలుగా పిటిషనర్ తరపు న్యాయవాదిని అత్యవసర విచారణ కోసం సీజేఐ తన ఇంటికి పిలిపించి మాట్లాడనున్నట్లుగా తెలుస్తోంది.

## ఉస్మానియా యూనివర్సిటీకి అంతర్జాతీయ లుక్..

### 1,000 కోట్లతో మెగా హాస్టళ్లు, అకాడమిక్ బ్లాకులు



ఉస్మానియా విశ్వ విద్యాలయానికి ఎంతో గొప్ప చరిత్ర ఉంది. స్వాతంత్ర్య పోరాటం నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన వరకు జరిగిన అనేక ఉద్యమాల్లో ఉస్మానియా వర్సిటీనే ప్రధానంగా నిలిచింది. నేడు వివిధ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న వారిలో చాలా మంది ఉస్మానియాలోనే చదువుకున్నారు. నేటికి కూడా ఓయూలో చదువుకోవాలని కోరుకునే విద్యార్థులు ఎందరో ఉన్నారు. అంతటి ఖ్యాతి కలిగిన ఉస్మానియా యూనివర్శిటీని కార్పొరేట్ వర్సిటీలకు ధీటుగా అభివృద్ధి చేయాలని భావిస్తోంది రేవంత్ సర్కార్. ఇందుకోసం రూ.1000 కోట్లకు పైనే ఖర్చు చేసేందుకు ముందుకు వచ్చింది.

ఉస్మానియా యూనివర్సిటీ రూపురేఖలు మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం రెడీ అయ్యింది. వర్సిటీలో అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తుంది. రూ.1000 కోట్లు ఖర్చు చేసి.. ఉస్మానియా వర్సిటీకి కొత్త కళ తీసుకురాబోతుంది. ఇందుకోసం వర్సిటీలో ప్రపంచస్థాయి పరిశోధనా కేంద్రాలు, మెగా హాస్టళ్లు, హైటెక్ అకాడమిక్ బ్లాకులు నిర్మించబోతున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఓయూ అధికారులు, విద్యా శాఖ సిబ్బంది.. డీపీఆర్ రెడీ చేసే పనిలో తలమునకలయి ఉన్నారు. వర్సిటీలో సైకిల్, వాకింగ్ ట్రాక్, క్రీడల కోసం ప్రత్యేక సదుపాయాలు, హెల్త్ కేర్ సెంటర్, పచ్చదనం అభివృద్ధి, కన్వెన్షన్ హాల్ ఇలా అన్ని హంగులు కల్పించబోతున్నారు.

తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఓయూ అభివృద్ధి పనులపై జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.

## అప్పటిదాకా ధైర్యంగా ఉండండి.. కేసీఆర్ పిలుపు



గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని, ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామాల నూతన సర్పంచులు.. వార్డు మెంబర్లు శుక్రవారం కేసీఆర్ ని మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. వారిని తన నివాసానికి సాదరంగా ఆహ్వానించి, గ్రామస్థుల సమష్టి మద్దతుతో ఎన్నికైన సర్పంచులను వారిని కేసీఆర్ శాలువాతో సత్కరించి, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా తన వద్దకు వచ్చిన గ్రామస్థులను, గుర్తుపట్టి, పేరు పేరునా పలకరించి, వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో వాతావరణం, మౌలిక వసతుల అందుబాటు, పండుతున్న పంటల పరిస్థితి గురించి పేరు పేరునా అడిగి కేసీఆర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. "మనకు అన్ని కాలాలు అనుకూలంగా వుండయి. కొన్నికొన్ని సమయాలు కష్టాలు వస్తయి. వాటికి వెరవకూడదు. మల్లా మన ప్రభుత్వమే వస్తది. తెలంగాణ పల్లెలకు తిరిగి మంచిరోజులు వస్తయి. అప్పడిదాకా ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో అధైర్య పడొద్దు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన స్ఫూర్తితో స్వయంశక్తితో పల్లెలను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు నడవాలె" అని కేసీఆర్ గ్రామస్థులకు వివరించారు. "ఇప్పుడు నూతనంగా ఎన్నికైతున్న సర్పంచులు గొప్ప ఆలోచనలతో తమ గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రణాళికలు రచించుకోవాలి. గంగదేవిపల్లి లాంటి అభివృద్ధి చెందిన స్వయం సహాయక గ్రామాలను ఆదర్శంగా తీసుకొని, ప్రజల భాగస్వామ్యంతో కమిటీలు వేసుకొని, మన పని మనం చేసుకుంటూ మన పల్లె అభివృద్ధికి పాటుపడాలి. ఎవరో ఏదో చేస్తారని, ఏదో ఇస్తారని ఆశలు పెట్టుకొని ఆగం కావద్దు" అని కేసీఆర్ తెలిపారు.

## గ్లోబల్ సమ్మిట్ కాదు.. ముందు యూరియా సరఫరాపై దృష్టిపెట్టు.. సీఎం రేవంత్ రెడ్డికి

### -హరీశ్‌రావు హితవు



రాష్ట్రంలో యూరియా కష్టాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మండిపడ్డారు. రేవంత్ రెడ్డి గారూ.. నిన్ననే మీరు పర్యటించిన నర్సంపేట నియోజకవర్గంలోని ఖానాపూర్ మండలం ధర్మరావు పేట గ్రామంలో యూరియా కోసం రైతులు పడుతున్నఅగచాట్లు ఇవి అని ఒక వీడియోను సోషల్‌మీడియా వేదికగా పోస్టు చేశారు.

రైతులకు యూరియా సరఫరా చేయడం చేతగాని రేవంత్ రెడ్డి, నిన్న ఉత్తర కుమార ప్రగల్భాలు పలికిండని హరీశ్‌రావు మండిపడ్డారు. విజయోత్సవాల పేరిట ప్రభుత్వ ధనం దుబారా చేస్తూ.. చేసింది లేక, చెప్పకునేది లేక గప్పాలు కొట్టిండని విమర్శించారు. గ్లోబల్ సమ్మిట్ అంటూ, విజన్ 2047 అంటూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న రేవంత్ రెడ్డి , ముందు రైతులకు యూరియా సరఫరా చేయడంపై దృష్టి సారించాలని సూచించారు.



# వ్యవసాయ శాఖ కీలక నిర్ణయం

## సాగు చేసిన విస్తీర్ణానికే యూరియా పంపిణీ

- ✓ సాగు చేసిన విస్తీర్ణానికే యూరియా - కొత్త నిబంధనల అమలు
- ✓ బ్లాక్‌మార్కెట్‌కి చెక్ - రైతులకు నేరుగా పంపిణీ
- ✓ పాస్‌బుక్ ఆధారంగా యూరియా లెక్కలు - సాంకేతికతతో పర్యవేక్షణ
- ✓ పెద్ద రైతుల ఆధిపత్యానికి ఇక ముగింపు - చిన్న రైతులకు ప్రాధాన్యం
- ✓ గత సీజన్ సమస్యలపై ఫోకస్ - ఈసారి ముందస్తు చర్యలు
- ✓ ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాల దందాకు కత్తెర
- ✓ రాష్ట్రానికి అవసరమైన యూరియా నిల్వలు - కేంద్రంపై ఒత్తిడి
- ✓ ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిల్వలు - రైతుల అవసరాలపై తాజా లెక్కలు

మిగతా 2 లో

యాసంగి సీజన్‌లో యూరియా కొరత లేకుండా బ్లాక్ మార్కెట్‌లో విక్రయాలు జరగకుండా వ్యవసాయ శాఖ కట్టడి చేయనుంది. సాగు చేసిన వివరాల ప్రకారం పంపిణీ కానుంది. రైతులు ఈ సీజన్‌లో ఎంత పంట సాగు చేస్తున్నారో పట్టాదారు పాస్ బుక్‌ల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. పంట సాగు పరిగణనలోకి తీసుకొని జిల్లాలకు ఎంత యూరియా కావాలో లెక్కలు తేల్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గత పంట కాలాలలో అవసరానికి మించి యూరియా వాడకం చేయడంతో చాలా మంది రైతులకు యూరియా దొరకలేదు. చేను ఎదిగే దశ కావడంతో రూ. 150 ఎక్కువ చెల్లించి బ్లాక్ మార్కెట్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్.. మంత్రి ఉత్తమ్ నియోజకవర్గంలో తీవ్ర ఉద్రిక్తత



## ఆ వీడియో వైరల్ అవ్వడంతో అందరూ తిట్టారు

సాయి ఈశ్వరచారి భార్య ఆడియో వైరల్



## ఎవరో రెచ్చగొడితే బీసీలు బలి పశువులు కావొద్దు.. మంత్రి పొన్నం ప్రభాకర్



## మల్కాపూర్ మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి పై జగ్గారెడ్డి సీరియస్.. పార్టీ నుంచి సస్పెన్షన్



## హోంగార్డులను అవమానిస్తున్న రేవంత్ సర్కార్..

మాజీ మంత్రి హరీష్‌రావు ధ్వజం



## కల్వకుంట్ల గద్దలు మళ్లీ వస్తున్నాయి..

సామ రామ్మోహన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



## ఆగని బాంబు బెదిరింపులు.. మరో రెండు విమానాలకు బెదిరింపు మెయిల్స్



## ఉపాధి కోసం వెళ్లి ఉచ్చులో

ఉగ్రవాదుల చెరలో భువనగిరి యువకుడు



ఉపాధి కోసం జన్మనిచ్చిన తల్లిదండ్రులను, పుట్టిన ఊరును వదిలి ఖండాలు దాటి వెళ్లిన యువకుడు ఉగ్రవాదుల చెరలో చిక్కాడు. తన బిడ్డ ఎలా ఉన్నాడో అంటూ కన్నతల్లి, ఊరు ఊరంతా ఆ అబ్బాయి కోసం తల్లడిల్లుతున్న ఘటన యదాద్రి భువనగిరి జిల్లా బండ సోమారం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..

## బాల నేరస్తుల వయసు 14 కు తగ్గించండి

- మరోసారి తెరపైకి జువైనల్ ఏజ్ ఇష్యూ



క్రూరమైన నేరాలలో పాల్గొనే బాల నేరస్తుల అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. బాలలు అనే కారణంతో అత్యంత ఘోరమైన నేరాలలో పాల్పడినా వారు శిక్ష నుంచి మినహాయింపు పొందుతున్నారు. దీనిపై చాలా కాలంగా దేశంలో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం 17 సంవత్సరాల వరకు ఉన్న పిల్లలను జువైనల్స్ గా పరిగణించపడుతుండగా ఆ వయసును తగ్గించాలని వివిధ రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి.

## సుప్రీంకోర్టుకు చేరిన ఇండిగో సంక్షోభం.. సర్వీసుల రద్దుపై పిటిషన్ దాఖలు

మొదటి పేజీ తరువాయి

మరోవైపు ఇండిగో విమాన ప్రయాణికుల ఇబ్బందులు కొనసాగుతూనే ఉన్నాయి. ఒక్క రోజే వెయ్యి విమాన సర్వీసులు రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే, ఈనెల 15లోగా సమస్య పరిష్కారం అవుతుందని ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ వెల్లడించారు. సిబ్బంది కొరతను దృష్టిలో పెట్టుకుని విమానాలను రద్దు చేశామని అన్నారు. సిస్టమ్ రీబూట్ వల్ల విమానాలు రద్దు చేయాల్సి వస్తోందని ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.

వాళ్లకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వండి.. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ఇండిగో విమాన సర్వీసుల పునరుద్ధరణ క్రమంగా జరుగుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇవాళ ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ..ఇప్పటి నుండి దేశంలోని ఏ విమానాశ్రయంలోనూ ప్రయాణికుల ఎదురుచూపులు ఉండకూడదని ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు స్పష్టం చేశామన్నారు. విమానాశ్రయాల్లో ఏర్పడిన బ్యాక్‌లాగ్‌ను తగ్గించడమే ప్రభుత్వం ప్రధాన దృష్టి అన్నారు. అన్ని విమానాశ్రయాలు, విమానయాన సంస్థలతో కలిసి రంగంలోకి దిగి పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టులలో చిన్నపిల్లలు, తల్లులు, వృద్ధులు, దివ్యాంగులకు చెక్-ఇన్, బోర్డింగ్‌లో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని అన్ని విమానయాన సంస్థలకు సూచించినట్లు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

## హోంగార్డులను అవమానిస్తున్న రేవంత్ సర్కార్.. మాజీ మంత్రి హరీష్‌రావు ధ్వజం

ఎన్నికల ముందు హోంగార్డులకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కటి కూడా నెరవేర్చకపోగా, సీఎం రేవంత్ రెడ్డి వికృత చేష్టలతో వారిని తీవ్రంగా అవమానిస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంగార్డుల రైజింగ్ డే సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 15 వేల మంది హోంగార్డులకు ఆయన 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వారి సేవలను గుర్తించి చేపట్టిన చర్యలను గుర్తు చేశారు. జనవరి 2025లో వెలువడిన జీవో నెం.2 ప్రకారం సహజ మరణం పొందిన హోంగార్డుల కుటుంబాలకు రూ.5 లక్షలు ఇస్తామని చెప్పారని.. కానీ, 10 నెలలు గడుస్తున్నా ఒక్కరికీ డబ్బు అందలేదన్నారు.

అదేవిధంగా హెల్త్ కార్డులు ఇస్తామని హామీ ఇచ్చారని.. సకాలంలో చికిత్స అందక అనేక మంది మరణిస్తున్నారని అన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ తప్ప మిగతా జిల్లాల హోంగార్డులకు 4 ఏళ్ల పెండింగ్ యూనిఫాం అలవెన్స్ ఇవ్వలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హోంగార్డు రవీందర్ కుటుంబానికి అండగా నిలుస్తామని, అధికారంలోకి వచ్చిన వెంటనే కారుణ్య నియామకాలు ఇస్తామని చెప్పిన రేవంత్ ఆ హామీని విస్మరించారని పేర్కొన్నారు. అభయ హస్తం మేనిఫెస్టోలో హోంగార్డుల అన్ని సమస్యలు తక్షణమే పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయని ఆరోపించారు. జీతాలు సకాలంలో రాకపోవడంతో పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి అద్దెలు కూడా కట్టలేని దయనీయ స్థితిలో హోంగార్డులు ఉన్నారని పేర్కొన్నారు.

గడిచిన రెండేళ్లలో 60 మంది పైగా హోంగార్డులు చనిపోయారని.. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారికి తప్ప మిగతా సహజ మరణాలకు ఒక్క రూపాయ కూడా ఇవ్వలేదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఆర్డర్లీ వ్యవస్థ రద్దు, ఇతర భత్యాలు అంటూ రేవంత్ హామీలు గాలి మాటలుగానే మిగిలిపోయాయి అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని.. హోంగార్డుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## కల్వకుంట్ల గద్దలు మళ్లీ వస్తున్నాయి.. సామా రామ్మోహన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

శ్రీసాయి ఈశ్వర్ ఆత్మాహుతిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్‌కు కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఆయన కేటీఆర్ చేసిన ట్వీట్‌ను ట్యాగ్ చేస్తూ.. "బీసీ సోదరులారా తస్మాత్ జాగ్రత్త.. ఆత్మహత్యలపై రాజకీయాలు చేసే కల్వకుంట్ల గద్దలు మళ్లీ వస్తున్నాయి" అని అన్నారు. బీసీ రిజర్వేషన్ల పట్ల నరనరాన తన వ్యతిరేకతను ఇతర రాష్ట్రాలకు వెళ్లి విషం కక్కిన కాలనాగు అంటూ కేటీఆర్‌పై ఫైర్ అయ్యారు. బీసీ రిజర్వేషన్ల అంశం కేంద్రం దగ్గర పెండింగ్‌లో ఉన్నదని తెలిసినా.. బీజేపీని కాపాడడానికి కాంగ్రెస్‌పై విషం కక్కుతూ బీసీలను మోసం చేస్తున్న దగాకోరు డ్రామారావు అంటూ ధ్వజమెత్తారు. "గుర్తుపెట్టుకోండి.. బీజేపీ-బీఆర్ఎస్ డ్రామాలు సాగనివ్వం, బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వంపై పోరాటం ఆగదు" అని సామా సామా రామ్మోహన్ రెడ్డి స్పష్టం చేశారు.

## గ్లోబల్ సమ్మిట్ కాదు.. ముందు యూరియా సరఫరాపై దృష్టిపెట్టు.. సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు హితవు

మొదటి పేజీ తరువాయి

వ్యవసాయ ప్రణాళికను గాలికి వదలి రైతులు, మహిళలు, వృద్ధులు అందర్నీ యూరియా కోసం గంటల కొద్దీ క్యూ లైన్లలో నిలబెడే పరిస్థితి తెచ్చావని సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. మీ దుర్మార్గ పాలన రైతుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. మీ రైతు వ్యతిరేక విధానాతో రైతులు నరకం చూస్తున్నారని అన్నారు. గత సీజన్ యూరియా కష్టాలు, చేదు అనుభవాల నుంచి మీరు, మీ ప్రభుత్వం ఏం నేర్చుకోకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. సీజన్ ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే, ముమ్ముందు పరిస్థితి ఇంకా ఎంత దారుణంగా ఉంటుంది? అని ప్రశ్నించారు. యూరియా కొరత రాకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పారిశ్రామిక వాడల భూములను అమ్మితే అందులో 20% కార్మికులకు ఇవ్వాలి: మల్లారెడ్డి



పారిశ్రామిక వాడల భూములను అమ్మితే అందులో కూడా 20% డబ్బులు పారిశ్రామిక కార్మికులకు ఇవ్వాలని మాజీ మంత్రి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జరిగిన ట్రేడ్ యూనియన్ ప్రతినిధుల రౌండ్ టేబుల్ సమావేశంలో మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో సినిమా టికెట్ ధరలు పెంచితే అందులో 20శాతం సినీ కార్మికులకు ఇవ్వాలని చట్టం తెస్తానని చెప్పాడన్నారు. మరి పారిశ్రామికవాడల భూములు అమ్మినప్పుడు కూడా కార్మికులకు 20శాతం ఇవ్వాలనే చట్టం తీసుకురావాలన్నారు. చట్టం తీసుకువచ్చి భూమి అమ్ముకోవచ్చన్నారు.కేంద్రం కూడా కొత్త కొత్త చట్టాలు తీసుకువచ్చి కార్మికులను మోసం చేసం చేయాలని చూస్తోందన్నారు. కాబట్టి కార్మికులు మేల్కోవాలని చెప్పారు. తెలంగాణలో కార్మికులకు ఈఎస్ఐలో అసలు మందులే లేవన్నారు. నగరంలోని పరిశ్రమలు అన్ని అమ్మితే కార్మికుల కుటుంబాలు ఏమైపోవాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో, కేంద్రంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొట్లాడటానికి బీఆర్ఎస్ పార్టీ, తాను ఉంటానని చెప్పారు. కార్మికులు ఢిల్లీకి వెళ్లేందుకు తాను రూ.10 లక్షలు ఖర్చుల కోసం ఇస్తానన్నారు. బీఆర్ఎస్ పార్టీ సైతం కార్మికులతోనే ఉంటుందన్నారు.

## వ్యవసాయ శాఖ కీలక నిర్ణయం
### సాగు చేసిన విస్తీర్ణానికే యూరియా పంపిణీ

మొదటి పేజీ తరువాయి

రైతు వేదికలు వద్ద పంపిణీ చేసిన బడా రైతులకే దొరికింది తప్ప సన్న, చిన్నకారు, కౌలు రైతులు యూరియా సరిపడా లభించలేదు.

రైతులకు యూరియా దొరకకపోవడంతో వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఇలాంటి పరిస్థితి ఈ సీజన్?రాకుండా ముందు జాగ్రత్తగా ఎంత యూరియా కావాలో ఇప్పటి నుంచే సిద్ధం చేసుకుంటున్నారు. వరి పంట సాగు చేసిన ప్రకారమే పంపిణీ చేయనున్నట్లు తెలిసింది. ఈ సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అవసరమని కేంద్రానికి లేఖ రాసింది. ఈనెలాఖరు వరకు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేయాలని కోరింది. కానీ, ఇప్పటి వరకు రెండు నెలకు సంబంధించిన యూరియా నిల్వలు సగం మాత్రమే వచ్చినట్లు వ్యవసాయ శాఖ పేర్కొంది. మిగతా నిల్వలు త్వరగా ఇవ్వాలని కేంద్ర రసాయనాల శాఖను కోరింది. ఆలస్యం జరిగితే అన్నదాతల నుంచి ఆగ్రహం తప్పదని తెలిపింది. గ్రామాల్లో రైతులు విస్తీర్ణం కంటే ఎక్కువ తీసుకోకుండా ప్రత్యేక యాప్?సిద్ధం చేస్తోంది. గత నెల నుంచి ఆధార్ లింకుతో ఈ పోస్ యంత్రాలతో యూరియా, ఇతర మందులు అమ్మకాలు జరుపుతున్నారు. రైతుకు ఉన్న భూమికి ఎంత యూరియా అవసరం అంతే తీసుకునేలా చర్యలు చేపట్టింది. అధికారులను తప్పుదోవ పట్టించి బ్లాక్‌లో అమ్మాలని ఎక్కువ తీసుకుంటే దొంగలు దొరికిపోతారు. అడ్డగోలుగా యూరియా కొనుగోలు చేయకుండా కట్టడి చేసేందుకు ప్రభుత్వం సాంకేతికతను ఉపయోగించి రైతులకు కష్టాలు లేకుండా చేయనుంది.

ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాల అక్రమ సంపాదనకు కళ్లెం..

పంట కాలం సమయంలో రైతులు యూరియా కోసం ఎగబడుతారో పసిగట్టే ఫర్టిలైజర్ వ్యాపారులు కృతిమ కొరత సృష్టించి అక్రమ సంపాదనకు తెగబడేవారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అడ్డగోలు ధరలకు అమ్మకాలు చేసేవారు. వీరికి కొందరు దళారులు సహకరించి రైతుల ముసుగులో యూరియా కోసం క్యూలైన్‌లో నిలబడి బస్తాలు తీసుకొని వ్యాపారులకు అమ్మేవారు. వీరి దందాకు స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు అండగా ఉండి రైతుల యూరియా అడిగితే స్టాక్ లేదని చెప్పి, బ్రోకర్లు వస్తే క్షణాల్లో ఐదారు బస్తాలను ఇచ్చేవారు. ప్రభుత్వం కొత్తగా రైతులు సాగు విస్తీర్ణం ప్రకారం యూరియా కేటాయింపులు చేస్తుండటంతో అధికారులు అక్రమ సంపాదనకు కత్తెర పడనుంది. వ్యాపారుల వద్దకు కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో రైతులు ఎగబడే పరిస్థితి ఉండదు. దీంతో ఫర్టిలైజర్?దుకాణాలు బస్తాపై ఉన్న ధరకే అమ్మకం చేయక తప్పదు.

రాష్ట్రంలో 3.10 లక్షల మెట్రిక్ టన్నులు నిల్వలు..

కేంద్రం గత రెండు మాసాల్లో రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగా నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల మేర యూరియా కేటాయించింది. అక్టోబర్‌కు సంబంధించి 37 వేల మెట్రిక్ టన్నుల యూరియా ఓడరేవుల నుండి రాష్ట్రానికి చేరుకోగా, నవంబర్?నెలకు సంబంధించిన 25 వేల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి చేరుకుంది. రాష్ట్రంలో 3,10 లక్షల మెట్రిక్ టన్నులు అక్టోబర్ నుండి ఇప్పటివరకు సరఫరా జరిగింది. ప్రస్తుతం రాష్ట్రంలో 1.85 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 65 టన్నుల డీఏపీ, 2.50 లక్షల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఈనిల్వలు ఒక నెల రోజులో పంపిణీ చేయవచ్చని, మిగతా రెండు నెలలో రైతులకు యూరియా పంపిణీ జరగడం కష్టమైతుంది. ఇప్పటికే మండల వ్యవసాయ శాఖ అధికారులు పంటలు వేసిన రైతులు ఏమేరకు యూరియా వాడకం చేస్తారో పట్టాపాసు బుక్?వివరాలు ఇచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు అధికారులు వివరాల ప్రకారం 6 లక్షల మెట్రిక్?టన్నుల యూరియా అవసరం ఉంటుందని అంచనా వేశారు.

## అప్పటిదాకా ధైర్యంగా ఉండండి.. కేసీఆర్ పిలుపు

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా వారికి జాతీయ, అంతర్జాతీయంగా పల్లెల ప్రగతి కోసం గొప్ప వ్యక్తులు చేసిన కృషి గురించి కేసీఆర్ వివరించారు. బంగ్లాదేశ్‌కు చెందిన సామాజిక ఆర్థికవేత్త, స్వయం సహాయక బృందాల ఏర్పాటుకు స్ఫూర్తి దాత, ప్రొఫెసర్ యూనిస్‌తో పాటు మన దేశానికే చెందిన అన్నా హజారే లాంటి దార్శనికుల గురించి వారి కృషిని వివరించారు. వారిని ఆదర్శంగా తీసుకుని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన స్ఫూర్తితో తమ పల్లెలను సామాజిక ఆర్థిక స్వయం సమృద్ధి కేంద్రాలుగా తీర్చి దిద్దుకోవాలి అని కేసీఆర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎర్రవెల్లి గ్రామ సర్పంచి, నారన్నగారి కవితా రామ్మోహన్ రెడ్డి దంపతులు, గ్రామ ఉప సర్పంచ్ ఎడ్మ సబితా కరుణాకర్, వార్డు మెంబర్లు, నర్సన్నపేట గ్రామ సర్పంచ్ గిలక బాల నర్సయ్య, ఇరు గ్రామాలకు చెందిన ప్రముఖులు సమావేశంలో హాజరయ్యారు. వారిని కేసీఆర్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నేత మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఆగని బాంబు బెదిరింపులు..
### మరో రెండు విమానాలకు బెదిరింపు మెయిల్స్

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మరోసారి బాంబు బెదిరింపుల కలకలం కుదిపేసింది. వరుసగా రెండు అంతర్జాతీయ ఫ్లైట్లకు అనామక మెయిల్స్ ద్వారా బాంబు హెచ్చరిక రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కోవైట్ నుంచి బయలుదేరి శంషాబాద్ చేరుకోవాల్సిన కేయూ-373 విమానానికి బెదిరింపు రావడంతో, భద్రతా కారణాల దృష్ట్యా ఆ ఫ్లైట్‌ను మస్కట్‌కు మళ్లించారు. ప్రయాణికుల భద్రతకు ఎలాంటి ప్రమాదం కలగకుండా ముందస్తు చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విమానయాన అధికారులు తెలిపారు.

ఇదే సమయంలో లండన్ నుంచి హైదరాబాదు వస్తున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ బిఏ-277 ఫ్లైట్‌కూ ఇదే తరహా మెయిల్ రావడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసర ప్రోటోకాల్ అమల్లోకి వచ్చింది. పైలట్ పరిస్థితిని పర్యవేక్షించి విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. వెంటనే ప్రోటోకాల్ ప్రకారం ప్రయాణికులందరిని దిగదీసి అసోలేషన్ ప్రాంతానికి తరలించారు. ఆ తరువాత బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు విమానాన్ని పూర్తిగా ఖాళీ చేసి అలర్ట్‌లో తనిఖీలు ప్రారంభించాయి. టర్మినల్ ప్రాంతంలో కూడా అదనపు భద్రతా చర్యలు అమలు చేస్తూ అన్ని మూమెంట్స్‌ను కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తున్నారు. అధికారులు ఈ బెదిరింపు మెయిల్స్ ఎక్కడి నుంచి వచ్చాయో గుర్తించేందుకు సైబర్, ఇంటెలిజెన్స్ విభాగాలు సంయుక్తంగా దర్యాప్తు ప్రారంభించాయి. ఈ ఘటనతో విమానాశ్రయంలో కొద్దిసేపు ఆందోళన నెలకొన్నా, ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని అధికారులు స్పష్టం చేశారు.

## ఉస్మానియా యూనివర్సిటీకి అంతర్జాతీయ లుక్.. 1,000 కోట్లతో మెగా హాస్టళ్లు, అకాడమిక్ బ్లాకులు

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. వర్సిటీలో చేపట్టబోతున్న అభివృద్ధి పనులపై ప్రొఫెసర్లు, విద్యార్థుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వర్సిటీ పనులకు ఎంత మొత్తం ఖర్చు చేసేందుకైనా తమ ప్రభుత్వం సిద్ధమే అన్నారు. డిసెంబర్ 10న ఓయూని సందర్శిస్తానని సీఎం రేవంత్ తెలిపారు.

ఆర్కిటెక్ట్‌లు ఇప్పటిక వరకు డిజైన్ చేసిన అభివృద్ధి నమూనాలను స్టూడెంట్స్‌కు అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వీటిపై విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు డ్రాఫ్ట్ బాక్సులతో పాటుగా.. ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా రూపొందించాలని సూచించారు. ఓయూ విద్యార్థుల పోరాటాన్ని ప్రతిబింబించే చిహ్నాలు ఏర్పాటు చేయాలన్నారు. హాస్టళ్లు, అకడమిక్ భవనాల నిర్మాణంలో మరింత ముందు జాగ్రత్తతో వ్యవహరించాలని తెలిపారు.

హాస్టళ్లలో ఇప్పటికే 100 మంది విద్యార్థులుంటే.. త్వరలో నిర్మించబోయే వాటిల్లో.. అదనంగా మరో 10 శాతం విద్యార్థులకు వసతి కల్పించేలా నిర్మాణం ఉండాలన్నారు. సిబ్బంది, విద్యార్థులకు భవిష్యత్తులో కూడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్మాణాలు ఉండాలన్నారు. అలానే వర్సిటీలో ఉన్న వారసత్వ, చారిత్రక భవనాలను సంరక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

## ఉపాధి కోసం వెళ్లి ఉచ్చులో ఉగ్రవాదుల చెరలో భువనగిరి యువకుడు

మొదటి పేజీ తరువాయి

గ్రామానికి చెందిన నల్లమాస జంగయ్య, మహేశ్వరి దంపతుల రెండో కుమారుడు ప్రవీణ్ గతేడాది నవంబరులో ఓ బోర్‌వెల్ కంపెనీ తరపున సౌతాఫ్రికా దేశంలోని మాలి దేశంలో కోబ్రి ప్రాంతానికి వెళ్లాడు. ఎంత బిజీగా ఉన్నా ప్రతి రోజూ ఉదయం 9 గంటల సమయంలో తల్లిదండ్రులతో మాట్లాడేవాడు. గత నెల 22న అతడు ఇంటికి చివరి కాల్ చేశాడు. ఆ తర్వాతి రోజు నుంచి అతడి ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఈ నెల 4న బోర్‌వెల్ కంపెనీ ప్రతినిధులు ప్రవీణ్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి అతడు కిడ్నాప్ అయ్యాడని సమాచారం అందజేశారు.

కాగా, 23న ప్రవీణ్ విధులు ముగించుకుని తాను ఉంటున్న గది వద్దకు వెళ్తుండగా జేఎన్ఐఎం సంస్థకు చెందిన ఉగ్రవాదులు కిడ్నాప్ చేశారని తెలిపారు. గతంలోనూ ఆ ప్రాంతంలో అదే సంస్థకు చెందిన ఉగ్రవాదులు కొంతమంది విదేశీయులను కిడ్నాప్ చేశారు. బోర్‌వెల్ కంపెనీ ప్రతినిధులు భారత రాయబార కార్యాలయం అధికారులతో ప్రవీణ్ ఆచూకీ కోసం సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ క్రమంలోనే ప్రవీణ్ కుటుంబ సభ్యులు తమ కుమారుడిని ఉగ్రవాదుల చెర నుంచి విడిపించాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

## కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్.. మంత్రి ఉత్తమ్ నియోజకవర్గంలో తీవ్ర ఉద్రికత్త

గ్రామ పంచాయతీ ఎన్నికలు గ్రామాల్లో చిచ్చుపెడుతున్నాయి. పార్టీలు, వర్గాల మధ్య ఆధిపత్యంతో ఘర్షణలకు దారి తీస్తున్నాయి. ప్రత్యర్థి పార్టీలతోనే కాకుండా ఒకే పార్టీలో రెండు వర్గాలుగా ఏర్పడి పరస్పరం కత్తులు దూసుకుంటున్నారు. తాజాగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాల నాయకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన నాయకులు రెండు గ్రూపులుగా ఏర్పడి రాళ్లు, కత్తులు, గొడ్డళ్లతో బీభత్సం సృష్టించారు. సూర్యాపేట జిల్లాలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

హుజూర్ నగర్ నియోజకవర్గం, చింతలపాలెం మండలం కృష్ణాపురంలో మైనారిటీ సామాజికవర్గానికి చెందిన ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులుగా పోటీలో నిలబడ్డారు. వీరిద్దరు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే కావడంతో పార్టీ ఒక్కరే పోటీ చేయాలని సూచించినా పట్టించుకోకుండా ఇద్దరూ బరిలో నిలిచారు. దీంతో గ్రామానికి చెందిన మైనారిటీ రెండువర్గాలుగా విడిపోయారు. ఈ క్రమంలో ఓ వర్గం ఇతర సామాజికవర్గ అభ్యర్థికి మద్దతు ఇస్తుందన్న అనుమానంతో దాదా బుడే వర్గీయులు షేక్ గఫూర్, షేక్ సైదా, ఇస్మాయిల్ వర్గంపై రాళ్లు, కర్రలు, గొడ్డళ్లతో దాడికి పాల్పడ్డారు. ఇళ్లపైకి వెళ్లి బీభత్సం సృష్టించారు. ఇరువర్గాల దాడిలో ఆరు బైకులు, ఒక టాటా ఏసీ వాహనం ధ్వంసం అయ్యాయి.

## బాల నేరస్తుల వయసు 14 కు తగ్గించండి.. మరోసారి తెరపైకి జువైనల్ ఏజ్ ఇష్యూ

మొదటి పేజీ తరువాయి

ఈక్రమంలో తాజాగా ఈ జువైనల్ ఏజ్ విషయంలో ఢిల్లీ బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ ప్రైవేట్ సభ్యుల బిల్లును పార్లమెంట్ లో ప్రతిపాదించే యోచనలు ఉన్నట్లు చెప్పారు.

దారుణమైన నేరాలకు పాల్పడేవారిపై విచారణకు జువెనైల్ జస్టిస్ చట్టం 2015 కింద బాల నేరస్థుల వయస్సును 14 సంవత్సరాలకు తగ్గించాలని ప్రతిపాదిస్తానని మనోజ్ తివారీ అన్నారు. లోక్‌సభలో ప్రైవేట్ సభ్యుల బిల్లును ప్రవేశపెట్టడం ద్వారా దీనిని ప్రతిపాదించబోతుతన్నట్లు ఆయన తెలిపారు. మన దేశంలో జువైనల్ చట్టం ప్రకారం 17 ఏళ్ల వరకు వారిని బాలలుగా పేర్కొంటున్నారు. కానీ పలు సందర్భాల్లో 15-17 ఏళ్ల లోపు ఉన్నవారు అత్యంత కృరమైన నేరాలకు పాల్పడుతున్న ఉదంతాలను నిరంతరం చూస్తునే ఉన్నామని, ఒక పిల్లవాడు మూడు హత్యలకు కారణమైన విషయం కూడా తనకు తెలుసని అందువల్ల బాలల వయస్సు 14 సంవత్సరాలకు తగ్గించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఓ బాలుడు నేరానికి పాల్పడి కరెక్షన్ సెంటర్ కు వెళ్లి తరిగి వచ్చాక కూడా మరో హత్యకు పాల్పడ్డాడని ఇలాంటి వాటిని ఖచ్చితంగా పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఈ విషయంలో తాను చాలా ఆలోచించాకే ఈ సమస్యపై ప్రైవేట్ మెంబర్ బిల్లును సభలో ప్రవేశపెట్టాలనే ఆలోచనతో ఉన్నట్టు చెప్పారు.

## ఆ వీడియో వైరల్ అవ్వడంతో అందరూ తిట్టారు.. సాయి ఈశ్వరచారి భార్య ఆడియో వైరల్

డిసెంబర్ 4వ తేదీన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయం ముందు సాయి ఈశ్వరచారి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. కాగా ప్రస్తుతం సాయి భార్య కవిత మాట్లాడిన ఓ ఆడియో నెట్టింట వైరల్ అవుతోంది. కవిత మాట్లాడుతూ.. తన భర్త అనారోగ్యం కారణంగా తాను తీన్మార్ మల్లన్న ఆఫీసుకు వెళ్లి ఆర్థికసాయం కోరినట్టు తెలిపింది. మల్లన్న తనకు రూ.20వేలు ఆర్థికసాయం చేశాడని చెప్పింది. అయితే ఆర్థికసాయం చేసిన వీడియో ఇన్ స్టాగ్రామ్‌లో పెట్టడంతో లక్షల మంది చూశారని తెలిపింది. ఆ వీడియో వైరల్ అవ్వడంతో బంధువులు, కుటుంబ సభ్యులు ఫోన్ చేసి తిట్టారని చెప్పింది.

పిల్లలు బయటకు వెళ్లినా, ఎవరు బయటకు వెళ్లినా చీప్‌గా చూస్తున్నారని తమ బంధువులు దూషించారని తెలిపింది. తన భర్త కూడా వెళ్లొద్దు అన్నాడని, కానీ ఆర్థికసాయం చేసేవాళ్లు ఎవరూ లేరని వెళ్లినట్టు చెప్పింది. ఇదిలా ఉంటే సాయి సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పోచారం గ్రామానికి చెందిన వాడు కాగా జగద్గిరి గుట్టలో ఉంటూ క్యాబ్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. సాయి మరణంతో బీసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేయడంతోనే సాయి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

## ఎవరో రెచ్చగొడితే బీసీలు బలి పశువులు కావొద్దు.. మంత్రి పొన్నం ప్రభాకర్

ఎవరో రెచ్చగొడితే బీసీలు బలి పశువులు కావొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇవాళ నగరంలో బీసీ రిజర్వేషన్ల కోసం ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వర్ మృతదేహానికి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు బీసీ సంఘాల నేతలు నివాళులర్పించారు. అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ బలహీనవర్గాలకు కాంగ్రెస్ న్యాయం చేసిన తీరును తెలిపారు. కానీ, ఎవరో రెచ్చగొడితే బీసీలు బలి పశువులు కావొద్దని పిలుపునిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి, అమరుడు సాయి ఈశ్వర్ కుటుంబానికి ప్రభుత్వం తరపున సాయం అందిస్తామని అన్నారు. 42 శాతం బీసీ కోటా కోసం కేంద్ర స్థాయిలో తమ ప్రయత్నం తాము చేస్తున్నామని, కృష్ణమూర్తి కేసును కూడా సుప్రీంకోర్టులో ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు.

## మల్కాపూర్ మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి పై జగ్గారెడ్డి సీరియస్.. పార్టీ నుంచి సస్పెన్షన్

కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థికి వ్యతిరేకంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ లీడర్ పై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సీరియస్ చర్యలు తీసుకున్నారు. కొండాపూర్ మండలం మల్కాపూర్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్ అభ్యర్థి మామిడిపల్లి అనిల్ కుమార్‌ను పార్టీ బలపరచింది. అయితే పార్టీ బలపరిచిన అభ్యర్థికి సపోర్ట్ చేయకుండా వ్యతిరేక అభ్యర్థికి ప్రచారం చేస్తున్న మల్కాపూర్ మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉన్న భాస్కర్ రెడ్డి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మల్కాపూర్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున కారణంగానే పార్టీ నుంచి సస్పెన్షన్ చేస్తున్నామని, మరే ఇతర కారణాలు లేవని జగ్గారెడ్డి తెలిపారు.

# యువత మేలుకో-రాజ్యాంగాన్ని కాపాడుకో

## సీపీఎం పార్టీ జంగంమేట్ డివిజన్ కార్యదర్శి ఏ.కృష్ణనాయక్ పిలుపు



తెలుగు గళం న్యూస్ ,జంగంమేట్, 06 డిసెంబర్ : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా జంగంమేట్‌లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జంగంమేట్ డివిజన్ కార్యదర్శి ఏ. కృష్ణనాయక్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కులవ్యవస్థకు వ్యతిరేకంగా, సామాజిక న్యాయం,మహిళా సాధికారత,కార్మిక హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత యోధుడని




కొనియాడారు. అలాంటి మహనీయుడి కలల రాజ్యాంగాన్ని నేటి కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ప్రశ్నించే వారిపై దేశద్రోహుల ముద్ర వేస్తూ,మత రాజకీయాలతో ప్రజలను విభజిస్తోందని విమర్శించారు. విద్యా వ్యవస్థలో మతోన్మాద భావజాలాన్ని ప్రవేశపెట్టడం, సమానత్వంపై దాడులు చేయడం ప్రమాదకరమని అన్నారు. ప్రాంతం, కులం, మతం పేర్లతో సమాజంలో చిచ్చు పెడుతూ కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశ యువతను మతోన్మాద ఉచ్చులో పడేసి అసలు సమస్యలైన ఉద్యోగాలు, ఉపాధి,నాణ్యమైన విద్య వంటి అంశాల నుండి దూరం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన రెండు కోట్ల ఉద్యోగాల హామీ అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.దేశ సంపత్తిని కార్పొరేట్ శక్తుల చేతిలో పరిమితం చేస్తూ సామాన్య ప్రజలపై భారమేస్తోందని ఆరోపించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కలలు కన్న సమసమాజం సాధించాలంటే యువత మేలుకొని, ఇలాంటి పాలకులపై ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు రాజేష్, భరత్, శ్రీను, నందా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పున్నేలు క్రాస్ ఎస్ఎస్‌టి చెక్‌పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ స్నేహ శబరీష్




తెలుగు గళం న్యూస్ హనుమకొండ డిసెంబర్ 6:పున్నేలు క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన స్టాటిక్ సర్వైలెన్స్ టీం (ఎస్ఎస్‌టి)చెక్‌పోస్ట్‌ను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఎన్నికల నిబంధనల అమలు,మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) పాటింపు,వాహనాల తనిఖీలు సమర్థవంతంగా జరుగుతున్నాయా అనే విషయాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.చెక్‌పోస్ట్ వద్ద నమోదైన రికార్డులను పరిశీలించిన కలెక్టర్,ఎంతమంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని,రోజువారీ ఎన్ని వాహనాలను తనిఖీ చేస్తున్నారని అధికారులను అడిగి



తెలుసుకున్నారు.ప్రత్యేకంగా అనుమానాస్పద వాహనాల రవాణాపై అప్రమత్తంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.ఎన్నికల సందర్భంగా అక్రమ నగదు,మద్యం,ఇతర నిషేధిత వస్తువుల రవాణా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని,ప్రతి వాహనాన్ని నిఖార్సుగా తనిఖీ చేయాలని ఆదేశించారు.ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా, నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు.ఈ తనిఖీ సందర్భంగా సంబంధిత అధికారులు,సిబ్బంది కలెక్టర్‌కు చెక్‌పోస్ట్ పనితీరుపై వివరాలను అందించారు.

# అంబేద్కర్ ఆశయాల సాధనకు రాజ్యాంగ రక్షణకై పోరాడాలి

## కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఉసిల్ల కుమార్ పిలుపు



తెలుగు గళం న్యూస్ వరంగల్, 06 డిసెంబర్ :శనివారం ఖిలా వరంగల్ మండలం శంభునిపేట జంక్షన్‌లో ప్రపంచ మేధావి,భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతిని పురస్కరించుకొని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.ముందుగా డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఉసిల్ల కుమార్ మాట్లాడుతూ..డాక్టర్ అంబేద్కర్ కీర్తి ప్రతిష్టలు ప్రతి ఏడాదీ ఆకాశమంత ఎత్తుకు పెరుగుతున్నాయని,కానీ ఆయన ఆశయాలు మాత్రం ఇంకా గడప దాటలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి జాతీయీకరణ, పరిశ్రమల్లో కార్మికులకు యాజమాన్య వాటా వంటి విప్లవాత్మక ఆలోచనలు అంబేద్కర్ ప్రతిపాదించారన్నారు.మహిళా సమానత్వం కోసం హిందూ కోడ్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినప్పటికీ నాటి ప్రభుత్వం అంగీకరించకపోవడంతో కేంద్ర మంత్రి పదవికి ఆయన రాజీనామా చేసిన ఘన చరిత్రను గుర్తు చేశారు.1948 సంవత్సరంలోనే కార్మికులకు కనీస వేతన చట్టాన్ని తీసుకొచ్చిన మహానుభావుడు అంబేద్కర్ అని కొనియాడారు.బ్రాహ్మణిజం,క్యాపిటలిజం ఈ దేశానికి ప్రధాన శత్రువులని అంబేద్కర్ స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు.ఈరోజు తెలంగాణ రాష్ట్రంలోనే 142 కుల దురంకార హత్యలు జరిగాయని,భూస్వామ్య–పెట్టుబడిదారీ లక్షణాలు కలగలిసిన అగ్రవర్ణాల వల్లే ఈ హత్యలు పెరుగుతున్నాయని ఆరోపించారు.దళితుల హక్కుల రక్షణకు అనేక చట్టాలు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు వాటిని సక్రమంగా అమలు చేయకపోవడమే ఈ దుర్మార్గాలకు కారణమన్నారు.స్వాతంత్ర్యానికి 78 సంవత్సరాలు గడిచినా కుల వివక్ష, అంటరానితనం వంటి దురాచారాలు ఇంకా కొనసాగుతుండడం బాధాకరమన్నారు.తాము అంబేద్కర్ వారసులమని చెప్పుకునే చాలామంది ఆయన ఆలోచనలను ఆచరణలో పెట్టడం లేదని విమర్శించారు.కేవలం జయంతులు,వర్ధంతులు జరుపుకునే స్థాయికే పరిమితం కాకుండా,రాజ్యాంగానికి పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి ప్రతి భారత పౌరుడు రాజ్యాంగాన్ని అధ్యయనం చేసి,దానిని కాపాడేందుకు ఐక్యంగా పోరాటాలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజా గాయకుడు బీకే,కెవిపిఎస్ నాయకులు ఇనుముల ఎలిషా,మంద రామకృష్ణ,బితి రాజేష్, గద్దల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీపీ పరీక్షను వాయిదా వేయాలి -జక్కుల వంశీకృష్ణడిమాండ్

## డీజీపీ కార్యాలయం వద్ద జూనియర్ న్యాయవాదుల నిరసన




తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, 06 డిసెంబర్ :జూనియర్ న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పరీక్షను వాయిదా వేయాలని తెలంగాణ జూనియర్ అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల వంశీకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం జక్కుల వంశీకృష్ణ నేత ృత్వంలో తెలంగాణ జూనియర్ అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు డీజీపీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందరరేగా వంశీకృష్ణమాట్లాడుతూ..జిల్లా వారీగా వందలాది యువ న్యాయవాదులు ఏపీపీ పరీక్షల్లో పాల్గొంటున్నప్పటికీ,మెయిన్ ఎగ్జామినేషన్ కేంద్రాలు హైదరాబాద్‌లోనే ఏర్పాటు చేయడం వల్ల వారు తమ స్వస్థలాల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు అత్యంత ప్రాథమిక హక్కు అని,ఆ హక్కును అడ్డుకోవడం తీవ్ర అన్యాయం అని అన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.పరిస్థితి పరిష్కారం కాకపోతే వివిధ రాజకీయ పార్టీల నేతలతో కలిసి భారీ జన సమీకరణతో డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు విష్ణు వర్ధన్,శివాజీ,శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్‌లో ఘనంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలు




తెలుగు గళం న్యూస్ వరంగల్ , 06 డిసెంబర్ :ఖిలా వరంగల్ 43వ డివిజన్ తిమ్మాపూర్‌లో భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి సందరరేగా ఘనంగా నివాళులర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఇల్లందల శ్రీకాంత్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులు మిద్దెపాక ఎల్లయ్య హాజరై,అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ యువత ఆయన ఆశయాలను అనుసరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు కొమ్ము భాస్కర్,ఇనగాల సునీల్,చింత అరుణ్,కొమ్ము అరవింద్,కొమ్ము బాలు,జోగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.అలాగే సంఘం సలహాదారులు ఇల్లందల రవి,43వ డివిజన్ జవాన్ ప్రశాంత్ మరియు ఇతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్ గారికి నివాళులు అర్పించారు.ఈ సందరరేగా నాయకులు మాట్లాడుతూ..సమాజంలో సమానత్వం,న్యాయం,హక్కుల కోసం అంబేద్కర్ చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాలని పేర్కొన్నారు.

# అల్లిపురం గాంధీ స్టార్చ్ కాలనీలో డోర్ టు డోర్ చెత్త వేరు చేసే అవగాహన కార్యక్రమం



తెలుగు గళం న్యూస్ వరంగల్ , 06 డిసెంబర్ :ఖిలా వరంగల్ మండలం 44వ డివిజన్ పరిధిలోని అల్లిపురం గాంధీ స్టార్చ్ కాలనీలో డోర్ టు డోర్ చెత్త సేకరణ కార్యక్రమం కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమాన్ని సి.ఎం.హెచ్.ఓ రాజారెడ్డి, ఎం.హెచ్.ఓ రాజేష్ నేత ృత్వంలో చేపట్టారు.ఈ సందరరేగా ప్రతి ఇంటి నుంచి తడి చెత్త,పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని కాలనీ ప్రజలకు పాంఫ్లెట్ల ద్వారా అవగాహన కల్పించారు. చెత్తను వేరు చేయడం వల్ల పరిసరాలు శుభ్రంగా ఉండటంతో పాటు వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరుగుతుందని



అధికారులు వివరించారు.ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ జి.రవీందర్ సార్,జవాన్ మైదం కుమార్ పాల్గొని ప్రజలకు స్వయంగా అవగాహన కల్పించారు.కాలనీ ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి మంచి స్పందన తెలియజేశారు.

# డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కు నివాళులర్పించిన ఉపాధ్యాయులు



తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/డిసెంబర్ 6: వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పర్వతగిరి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.పాఠశాల వదిలిన అనంతరం పర్వతగిరి అంబేద్కర్ సెంటర్ వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా జెడ్ పి హెచ్ ఎస్ పర్వతగిరి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నవీన్ కుమార్ మాట్లాడుతూ..అస్పృశ్యత అంటరానితనాన్ని నిర్మూలించడానికి జీవితాంతం కృషిచేసిన మహనీయుడు బాబాసాహెబ్ అంబేద్కర్ అని అన్నారు.దృఢమైన రాజ్యాంగాన్ని ఈ దేశానికి అందించిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మౌనిక,పరుషరాములు,అనిల్,రమేష్ బాబు, ప్రశాంత్, శ్వేత,సరిత ఎమ్మర్సి సీ ఓ జయరాజ్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# వాణి విద్యానికేతన్ పాఠశాలలో సైబర్ భద్రత అవగాహన కార్యక్రమం

## డిజిటల్ యుగంలో విద్యార్థుల భద్రత అత్యవసరం - '1930' హెల్ప్‌లైన్ వినియోగంపై పోలీసుల స్పష్టీకరణ



తెలుగు గళం న్యూస్ జయశంకర్ భూపాలపల్లి రేగొండ, 06 డిసెంబర్ :రేగొండలోని వాణి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.వేగంగా మారుతున్న డిజిటల్ ప్రపంచంలో విద్యార్థులు ఎదుర్కొనే ప్రమాదాలను ద ృష్టిలో ఉంచుకొని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్వు రజిన్ కుమార్ ముందడుగు వేసి ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.కార్యక్రమానికి రేగొండ సబ్-ఇన్స్పెక్టర్ రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు.ఎస్సై రాజేష్ మాట్లాడుతూ,సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు, ఫేక్ లింకులు, ఫిషింగ్, ఆన్‌లైన్ గేమింగ్ ప్రమాదాలు, యాప్‌ల ద్వారా జరిగే మోసాలు, బ్యాంకింగ్ ఫ్రాడ్ వంటి అంశాలను విద్యార్థులు తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. "డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లను వాడుతున్న ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. తెలియని వ్యక్తులతో మాట్లాడటం, వ్యక్తిగత వివరాలు పంచుకోవడం పూర్తిగా మానుకోవాలి" అని సూచించారు.

'అవగాహన లేకపోవడమే సైబర్ నేరాలకు ప్రధాన కారణం'

రెండవ ఎస్సై సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి విద్యార్థులతో సంభాషిస్తూ,

"సైబర్ నేరగాళ్లు ఎక్కువగా నిర్లక్ష్యం చేసిన క్షణాలను లక్ష్యంగా చేసుకుంటారు. ఓ టీ పి లు, బ్యాంక్ వివరాలు, ఫోన్‌లో వచ్చే సందేహాస్పద లింకులు ఎవరితోనూ పంచుకోవద్దు. ఏ చిన్న అనుమానం వచ్చినా వెంటనే పోలీసులను సంప్రదించాలి" అని సూచించారు.

పోలీసు అధికారులు ఈ సందర్భంగా ప్రభుత్వం అందించే అత్యవసర సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ '1930' ప్రాముఖ్యతను వివరించారు.

- ఏదైనా సైబర్ నేరం జరిగిన వెంటనే '1930' కు కాల్ చేస్తే తక్షణ స్పందన లభిస్తుందని,
- ముఖ్యంగా ఆన్‌లైన్ మనీ ఫ్రాడ్ జరిగితే వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు నిలిపివేయించగల అవకాశాలు ఎక్కువగా ఉంటాయని,
- ఈ సేవ 24 గంటలు అందుబాటులో ఉంటుంది అని విద్యార్థులకు తెలిపారు.

విద్యార్థులు ఈ నంబర్ను తప్పనిసరిగా గుర్తుంచుకుని ఇంట్లో పెద్దలకు కూడా తెలియజేయాలని సూచించారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు సోషల్ మీడియా భద్రత, యూట్యూబ్-- ఇన్‌స్టాగ్రామ్ ప్రమాదాలు, గేమింగ్ అడిక్షన్, వ్యక్తిగత సమాచార రక్షణ వంటి అంశాలపై ప్రశ్నలు అడగగా, పోలీసు అధికారులు ప్రతి అంశాన్ని పూర్తిగా వివరించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రజిన్ కుమార్ మాట్లాడుతూ

"సాంకేతికత అభివ ృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ మోసాలు కూడా పెరుగుతున్నాయి. విద్యార్థుల్లో అవగాహన పెంపుకు ఇలాంటి కార్యక్రమాలు అత్యంత అవసరం. పోలీసు శాఖ చేసిన ఈ మంచి ప్రయత్నానికి మా పాఠశాల తరపున ధన్యవాదాలు" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది అరుణ్, నరేష్,ప ృథ్వి, మహేష్, పాఠశాల ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# కన్నెబోయినగూడెం గ్రామం నుంచి బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు



తెలుగు గళం న్యూస్ జనగామ డిసెంబర్ :జనగామ జిల్లా నర్మెట మండలం కన్నెబోయినగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్,బీజేపీ నేతలు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.శనివారం జనగామ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో వీరి పార్టీలో చేరిక కార్యక్రమం ఘనంగా జరిగింది.బీఆర్ఎస్‌లో చేరిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మడికంటి రాజయ్య,గౌడ సంఘం నాయకులు జంగోని కర్ణాకర్,బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు దారావత్ రాములు,గ్రామ కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ దారావత్ జయరాం,కాంగ్రెస్ నాయకులు రాజబోయిన యాకయ్య,ముదిరాజ్ యూత్ అధ్యక్షుడు దిండిగాలా కర్ణాకర్,గ్రామ యూత్ ఉపాధ్యక్షుడు గుడిపెల్లి సదేశ్,అలాగే బానోత్ సతీష్,బానోత్ శ్రీనివాస్,గుడిపెల్లి యాదగిరి,కాటబోయిన గోవర్ధన్ తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంతి రాజలింగం,మాజీ ఎంపీటీసీ బిక్షపతి,గ్రామ శాఖ అధ్యక్షుడు ఉచ్చంతల లక్ష్మీనారాయణ,బైరగోని శ్రీనివాస్,బానోతు రమేష్,మహమ్మద్ యాకుబ్ పాషా,క్రాంతి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వల్లే ఇతర పార్టీల నాయకులు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు.గ్రామ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



# ఎన్నికల శిక్షణ తరగతుల పరిశీలన

## సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలి-ఆర్‌డీఓ డి.ఎస్.వెంకన్న



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘన్‌పూర్,డిసెంబర్ 6: జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్‌డీఓ) డి.ఎస్.వెంకన్న, స్థానిక తహశీల్దార్లు వెంకటేశ్వర్లు, రాజేష్ రెడ్డితో కలిసి శివునిపల్లి జెడ్పీఎస్ఎస్ హైస్కూల్ మరియు జఫర్‌ఘడ్‌లో ఎన్నికల సిబ్బందికి జరుగుతున్న శిక్షణ తరగతులను ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఆర్‌డీఓ డి.ఎస్.వెంకన్న న్నికల విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని,సిబ్బంది అందరూ పారదర్శకత,నిబద్ధతతో పనిచేసి ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా పూర్తి అవగాహనతో విధులు నిర్వర్తించాలని సూచించారు.తహశీల్దార్లు వెంకటేశ్వర్లు,రాజేష్ రెడ్డి కూడా ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, ఎన్నికల నిర్వహణలో చట్టబద్ధంగా, క్రమశిక్షణతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.




# అనారోగ్యంతో ఉన్న కుటుంబాలను పరామర్శించిన కోలేపాక బిక్షపతి

## వైద్యులను కలిసి మెరుగైన చికిత్స కోరుతూ - బాధిత కుటుంబాలకు ధైర్యం



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ, 06 డిసెంబర్ :బిఆర్ఎస్ పార్టీ రేగొండ టౌన్ అధ్యక్షుడు కోలేపాక బిక్షపతి, పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తూ మానవతా సేవకు మరోసారి నిదర్శనంగా నిలిచారు. అనారోగ్యంతో ఉన్న ఇద్దరు కుటుంబ సభ్యులను గురువారం ప్రత్యక్షంగా ఆసుపత్రుల్లో పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.రేగొండ మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు పత్తి బుచ్చిరెడ్డి తల్లి అనారోగ్యంతో పరకాల ఉమాదేవి హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా, ఈ విషయం తెలిసిన వెంటనే కోలేపాక బిక్షపతి ఆసుపత్రికి చేరుకుని ఆమె ఆరోగ్య పరిస్థితిని విచారించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పి, అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందించేందుకు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విధులలో ఉన్న వైద్యులను కలిసి, ఆమెకు మెరుగైన చికిత్స అందించాలని కోరారు.



తరువాత, రేగొండ మండలానికి చెందిన మంతెన సురేష్ కుమార్తె జ్వరంతో వరంగల్ యం జి ఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటం తెలుసుకున్న బిక్షపతి, అక్కడికి చేరుకుని బాలిక ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ఆదరణగా నిలుస్తూ, ఆర్థికంగా కూడా రూ.3,000 సహాయం అందించారు. బాలికకు వెంటనే మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. కోలేపాక బిక్షపతి మాట్లాడుతూ, "ప్రజలు కార్యకర్తలు కష్టకాలంలో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం ప్రతి నాయకుడి బాధ్యత. ప్రజల సమస్యలపై స్పందిస్తూ, అందరికీ అందుబాటులో ఉండటం మా పార్టీ ధ్యేయం" అని అన్నారు. బిక్షపతి చేసిన ఈ పరామర్శలకు స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు ప్రశంసలు తెలియజేశారు.

# మూగ చెవిటి రే చీకటి పిల్లలతో సరదాగా గడిపిన ఐటిడిఏ పీ ఓ రాహుల్ దంపతులు

## వైకల్యంతో లక్ష్యాలకు దూరంగా ఉండకూడదు అంటూ విద్యార్థులకు సహకారం





భద్రాద్రి కొత్తగూడెం తెలుగు గళం డిసెంబర్ 06:భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులో ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఆధీనంలో నడపబడుతున్న వికాసం పాఠశాల (చెవిటి,మూగ,రేచీకటి) బాల బాలికలకు చేతులు మరియు కనుసైగల ద్వారా చదువుతోపాటు వారికి నచ్చిన క్రీడలలో నిష్ణాతులుగా చేయడానికి క్రీడా వస్తువులు అందజేయడం జరిగిందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు.దివ్యాంగుల దినోత్సవం రోజున భద్రాచలం పట్టణంలోని వికాసం పాఠశాల మూగ,చెవిటి,రే చీకటి పిల్లలతో ఐటిడిఏ పీవో రాహుల్ దంపతులు సరదాగా గడిపి 60 వేల రూపాయల విలువగల క్రీడా సామాగ్రిఅయిన టేబుల్ టెన్నిస్ సెట్, చెస్,క్యారం బోర్డ్, టెన్నికాయిట్ ఆట వస్తువులు అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..2020 సంవత్సరంలో న్యూఢిల్లీ మోటా సంస్థ ద్వారా వికాసం స్కూల్ భద్రాచలంలో స్థాపించారని,ఆ సమయంలో కరోనా ఉండడం వలన 2022 ఏప్రిల్ మాసంలో పాఠశాల ప్రారంభమైందని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలోని ఐటీడీఏల ఆధ్వర్యంలో నడపబడుతున్న ఏ ఒక్క వికాసం పాఠశాలలో కూడా ఐటీడీఏ తరఫున ఆట వస్తువులు ఇవ్వడం జరగలేదని,ముఖ్యంగా టేబుల్ టెన్నిస్ క్రీడా సెట్టు 46 వేల వ్యయంతో కొనుగోలు చేసి ఇవ్వడం జరిగిందని,మొట్టమొదటిసారి భద్రాచలం వికాసం స్కూల్లోనే టేబుల్ టెన్నిస్ క్రీడను ప్రారంభించడం జరిగిందని అన్నారు.వికాసం పాఠశాల అభివృద్ధి చేసి అధిక సంఖ్యలో బాల బాలికలను చేర్చుకోవడానికి నిధుల కోసం మోటాసంస్థ న్యూఢిల్లీకి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని,ప్రస్తుతం ఈ పాఠశాలలో పనిచేసే సిబ్బందికి విద్యార్థిని విద్యార్థుల సౌకర్యం కోసం ఐటిడిఏ ద్వారా నిధులు సమకూరుస్తున్నామని అన్నారు.ఈ పాఠశాలల్లో 60 మంది బాలబాలికలు విద్యనభ్యసిస్తున్నారని,ఒకటవ తరగతి నుండి 8వ తరగతి వరకు క్లాసులు నడుస్తున్నాయని అన్నారు.ఆడపిల్లలు-38 మంది మగ పిల్లలు-22 మంది చెవిటి మరియు మూగ కలిపి-48 మంది,రేచీకటి-12 మంది పిల్లలు ఉన్నారని అన్నారు.ఈ పాఠశాలలో ప్రిన్సిపాల్ అరుణకుమారి,ప్రియాంక,కృష్ణవేణి,అరుణ టీచర్లు పనిచేస్తున్నారని అన్నారు.



# స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కిషోర్ గోపీనాథ్‌కు చైర్మన్ శివసేనారెడ్డి అభినందనలు



తెలుగు గళం న్యూస్ హైదరాబాద్ , 06 డిసెంబర్ :తెలంగాణలో నూతనంగా ఏర్పాటు అవుతున్న స్పోర్ట్స్ యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా నియమితులైన డాక్టర్ కిషోర్ గోపీనాథ్,తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్ గోపీనాథ్‌కు చైర్మన్ శివసేనారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు ఏర్పాటు అవుతున్న ఈ క్రీడా విశ్వవిద్యాలయ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని,క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణా సదుపాయాలు అందించే విధంగా ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు.ఈ భేటీ ఎంతో సానుకూల వాతావరణంలో జరిగినట్టు సమాచారం.

# మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించండి..

- భద్రాద్రి రామయ్య సాక్షిగా సేవ చేసే అవకాశం కల్పించండి..
- ప్రభుత్వ పెద్దల సహకారంతో సుందర భద్రాచలం నిర్మాణానికి నాంది
- భద్రాచలం పంచాయతీకి కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధికి అడుగులు
- రామయ్య ఆశీస్సులు, ప్రజల విశ్వాసం నాకే ఉన్నాయి
- కత్తెర గుర్తుపై ఓటు.. సంక్షేమానికి ధీటు..
- కాంగ్రెస్ బలపర్చిన భద్రాచలం సర్పంచ్ అభ్యర్థి పూనెం కృష్ణ..



భద్రాచలం, డిసెంబర్6(తెలుగు గళం): “మీ ఇంటి బిడ్డగా ఒకసారి ఆశీర్వదించండి.. సర్పంచ్ పదవి నాకు గౌరవం కాదు, బాధ్యత. ఈ పవిత్రమైన భద్రాచలం పంచాయతీని సుందర భద్రాచలం దిశగా తీసుకెళ్లే యజ్ఞంలో నా ప్రాణం పెట్టి పనిచేస్తా. కాంగ్రెస్ హయాంలోనే భద్రాచలానికి అభివృద్ధి పునాదులు వేసిన విషయం ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరు. ఆ అడుగులను మళ్లీ రెట్టింపు వేగంతో ముందుకు తీసుకెళ్లాల్సిన సమయం ఇప్పుడు వచ్చింది. భద్రాచలం అభివృద్ధి ఒక ప్రాజెక్ట్ కాదు..అది ఒక భావోద్వేగం. మన ఊరి గౌరవం, మన దేవుడి మహిమ, మన పిల్లల భవిష్యత్తు. ప్రభుత్వ పెద్దల ఆశీర్వాదం, పరిపాలనా సహకారం, గ్రామ ప్రజల నమ్మకం.. ఈ మూడు ఇప్పుడు ఒకే దారిలో చేరిన ఈ చారిత్రక దశను వృథా చేయకుండా రోడ్లు, డ్రైనేజ్, శుభ్రత, స్ట్రీట్‌లైట్లు, పర్యాటక సదుపాయాలు, వైద్య వసతులు, భద్రత, నీటి మౌలిక వసతులు ప్రతి రంగంలో భద్రాచలాన్ని పూర్తిగా మార్చుకునే తరుణమిది. భద్రాద్రి నేలపై



అడుగుపెట్టిన ప్రతి యాత్రికుడు భద్రాచలం మారిందనే గర్వం అనిపించాలి.. దేవాలయం మహిమకే సరిపోయే రీతిలో పంచాయతీ కూడా నిలబడాలి.. ఇది నా కల కాదు, ఇది మన అందరి కల. మీరు నాపై నమ్మకం ఉంచితే, భద్రాచలం మరోసారి కాంగ్రెస్ బలం మీదే అభివృద్ధి గాథ రాస్తుంది. రామయ్య ఆశీస్సులు, ప్రజల విశ్వాసం, నా శ్రమ ఈ మూడు కలిస్తే భద్రాచలం పేరు దేశమంతా వినిపించేలా చేస్తా.. మన భద్రాచలం.. మన పాలన.. మన అభివృద్ధి లక్ష్యంతో పనిచేస్తానని, మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించాలి..” అని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన భద్రాచలం సర్పంచ్ అభ్యర్థి పూనెం కృష్ణ స్పష్టం చేశారు. ఈనెల 11న జరగనున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన సందర్భంగా ఆయన నినాదం ప్రతినిధితో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే...

**అభివృద్ధికి బాటలు వేద్దాం..**

ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు భద్రాచలం నియోజకవర్గ శాసన సభ్యులు డాః తెల్లం వెంకట్రావు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య సహకారంతో భద్రాచలం పట్టణ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తున్నది. ప్రజల ఆశీస్సులు అందిస్తే ప్రభుత్వ పెద్దల సహకారంతో దక్షిణ అయోధ్యగా ప్రఖ్యాతి గాంచిన భద్రాచలం పట్టణ అభివృద్ధికి బాటలు వేసుకునే అవకాశం ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతమైనప్పటికీ గిరిజనులు, గిరిజనేతరులను అక్కున చేర్చుకున్నది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, భవిష్యత్తులో సంక్షేమ ఫలాలు అందాలంటే కాంగ్రెస్ తోనే సాధ్యం.

**కత్తెర గుర్తుకు ఓటు.. సంక్షేమానికి ధీటు..**

ఈనెల 11న జరగనున్న దక్షిణ భారత అయోధ్యగా పిలవబడుతున్న శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానం ఉన్న భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న సర్పంచ్ అభ్యర్థిగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, నా ఎన్నికల గుర్తు కత్తెర పై అమూల్యమైన ఓటు వేసి మీ సేవకుడిగా సేవ చేసుకునే అవకాశం కల్పించాలని ప్రార్థిస్తున్నాను. భద్రాచలం సమగ్ర అభివృద్ధికి పంచాయతీ పరిధిలో ఉన్న 20 వార్డులు కూడా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు.

**30ఏండ్లుగా విడదీయరాని బంధం..**

భద్రాచలం ప్రాంతం ఎంతోమంది మేధావులను అక్కున చేర్చుకుంది. నాకు భద్రాచలం పట్టణంతో 30 ఏళ్లుగా విడదీయరాని బంధం ఏర్పడింది. ఏ ఇంటి గడప కు వెళ్లిన పెద్దన్నల నన్ను ఆదరిస్తారు. ఈ ప్రాంత ప్రజలకు ఏ కష్టం వచ్చినా ముందుండి నిలబడిన చరిత్ర మాది. ముందు నుండి రాజకీయాలలో ఉంటూ ఈ ప్రాంత వాసులకు సేవ చేస్తూ వచ్చాను. 1995లో జూలూరుపాడు జెడ్పీటిసి గా పోటీ చేశాను. 2018 తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలలో అభివృద్ధి కాంక్షించే కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులకు అవకాశం కల్పించాలని కోరుతున్నా..

**ఇచ్చిన ప్రతి మాటకు కంకణబద్ధుడై పనిచేస్తా..**

ప్రజలు ఒక్కసారి అవకాశం కల్పిస్తే మన భద్రాచలం... మన పాలన... మన అభివృద్ధి.. ఈ మూడు అంశాలను దృష్టిలో పెట్టుకుని శక్తి వంచన లేకుండా పనిచేసేందుకు సంసిద్ధులై ఉన్నాము. అంతే కాకుండా..

1. భద్రాచలం పట్టణ వాసులకు తక్కువ ధరకే ఇసుక అందేలా తీర్మానం చేసి సరఫరా చేసే విధంగా కృషిచేస్తాం..
2. సుందరయ్యనగర్ కాలనీ వద్ద ప్రారంభమైన డంపింగ్ యార్డు పనులను పూర్తి చేస్తాం.
3. వరదల సమయంలో వరద ముంపు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన కరకట్ట పనులు, ఫ్లైఓవర్ను పూర్తి చేస్తాం.
4. క్రీడాకారులకు సందరయ్యనగర్ కాలనీలో ఉన్న స్థలంలో స్టేడియం నిర్మాణానికి నిధులు తీసుకొచ్చి పనులు ప్రారంభిస్తాం..
5. అంబేద్కర్ సెంటర్ నుండి రాజుపేట వరకు సెంటర్ లైటింగ్ టెండర్లు అయిన పనులను ప్రారంభించి, పూర్తిచేస్తాం.
6. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ళు, పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తాం.
7. కట్టుకున్న ప్రతి ఇంటికి ఇంటి పన్ను..
8. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి పాలక మండలి ఏర్పాటుచేసి మాడవీధుల అభివృద్ధికి, టెంపుల్ అభివృద్ధికి కృషిచేస్తాము.
9. గిరిజన, గిరిజనేతరుల సూచనలు, సలహాలు, సమన్వయంతో పట్టణ అభివృద్ధికి కృషిచేసాము..
10. అన్ని వార్డుల్లో పారిశుద్య పనులను ప్రత్యేక బృందం ద్వారా అన్ని కాలనీలను శుభ్రం చేయిస్తాం.




11. సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబరును పెట్టి వచ్చిన సమస్యలపై స్పందించి పరిష్కరిస్తాము.
12. మిగిలిపోయిన రోడ్లు, డ్రెయిన్లు, కరెంటు స్థంబాలు వేయించి పూర్తిచేస్తాం.

వీటితో పాటుగా స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పరిశీలన చేస్తూ వారి బాధలను తీర్చేందుకు వారి సహకారంతో ముందుకెళ్తాం.

# ఎన్నికల నివేదికలు త్వరగా సమర్పించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ఐనవోలు,పంథిని క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయాల్లో
- సర్పంచ్,వార్డు స్థానాల ఉపసంహరణ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



తెలుగు గళం న్యూస్ హనుమకొండ డిసెంబర్ 6 :ఎన్నికలకు సంబంధించిన నివేదికలు త్వరగా సమర్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఎంపీడీవో,రిటర్నింగ్,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు.శనివారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని ఐనవోలు,పంథిని క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు.క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్,వార్డు స్థానాల ఉపసంహరణ ప్రక్రియను పరిశీలించారు.ఐనవోలు క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఐనవోలు,పున్నేలు,ఒంటిమామిడిపల్లి,ఉడతగూడెం గ్రామాలు,పంథిని క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో పంథిని,కక్కిరాలపల్లి,పెరుమాండ్ల గూడెం గ్రామాలకు సంబంధించి సర్పంచ్,వార్డు స్థానాలకు ఏకగ్రీవమైన వివరాలను ఎంపీడీవో నర్మద,రిటర్నింగ్,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు ఎన్నికల ప్యాక్రియా జరగాలని అన్నారు.విత్ డ్రా అయ్యాయని,ఎన్ని ఏకగ్రీవమయ్యాయని,అభ్యర్థుల నుండి నామినేషన్ల ఉపసంహరణ ఎలా తీసుకుంటున్నారని,ఫారం 9 ఎలా ప్రిపేర్ చేస్తారని,ఏమైనా ఏకగ్రీవాలు అవుతున్నాయా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నివేదికలు ఆలస్యం చేయకుండా త్వరగా పంపాలన్నారు.నామినేషన్లు ఉపసంహరించుకున్న అభ్యర్థుల వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో నర్మదా,తహసిల్దార్ విక్రమ్ కుమార్,ఎంపీఓ రఘుపతి రెడ్డి,ఇతర అధికారులు పాల్గొన్నారు.



# హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవంలో రేగొండ హోంగార్డ్ కుమార్‌కు ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం

- విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధతకు గుర్తింపు



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ, 06 డిసెంబర్ :63వ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా భూపాలపల్లి జిల్లా పోలీసు శాఖ ఉత్తమ సేవలు అందించిన హోంగార్డ్స్‌ను సత్కరించింది. ఈ కార్యక్రమంలో రేగొండ పోలీస్ స్టేషన్‌కు చెందిన హోంగార్డ్ కుమార్ తన విధుల్లో చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావానికి గుర్తింపుగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.

హోంగార్డ్ కుమార్ రేగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో కోర్టు ప్రాసెస్ డ్యూటీ లో పనిచేస్తున్నారు. నేరస్తులకు నోటీసుల జారీ, కోర్టుకు సంబంధించిన పత్రాల పంపిణీ, హాజరుల నిర్వహణలో ఆయన చూపిన సమయపాలన, బాధ్యతాయుత వైఖరి, చురుకుదనం పోలీసు వర్గాల దృష్టిని ఆకర్షించింది. తన పని పట్ల చూపిన అంకితభావంతో పలు సందర్భాల్లో క్లిష్టమైన కోర్టు ప్రక్రియలను సమర్ధవంతంగా నిర్వహించడంలో కుమార్ పాత్ర ప్రత్యేకమైందని పోలీసు అధికారులు అభిప్రాయపడ్డారు.

హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, “పోలీసింగ్ వ్యవస్థలో హోంగార్డ్స్ పాత్ర చాలా కీలకం. కేసుల విచారణ, నిఘా, కోర్టు ప్రాసెస్ వంటి ప్రతీ పనిలో వారు చూపే క్రమశిక్షణ, అంకితభావం పోలీస్ శాఖను బలోపేతం చేస్తుంది. తమ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించే కుమార్ లాంటి సిబ్బంది వల్లే పోలీసులు ప్రజలకు మరింత సమర్థంగా సేవలందించగలుగుతున్నారు” అని అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, హోంగార్డు ఆర్ఐ పూర్ణ, వెల్ఫేర్ ఆర్ఐ కాసిరం నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు. ప్రశంసాపత్రం అందుకున్న కుమార్‌ను గణపురం సీఐ కరుణాకర్ రావు, రేగొండ ఎస్సైలు రాజేష్,సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి,తోటి హోంగార్డ్స్ శ్రీశైలం, శ్రీను తదితరులు అభినందించారు. స్థానిక పోలీసు సిబ్బంది, గ్రామస్థులు కూడా కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా పోలీసుల ఉత్సాహంతో నిర్వహించగా, సత్కారం పొందిన కుమార్ ఈ గౌరవాన్ని తనపై ఉంచిన నమ్మకానికి ప్రతీకగా భావిస్తున్నట్టు తెలిపారు. భవిష్యత్తులో కూడా అదే విధంగా క్రమశిక్షణతో సేవలందిస్తానని ఆయన పేర్కొన్నారు.

# జిల్లాలో అసంక్రమణీయ వ్యాధులు,జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష

## - కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



తెలుగు గళం న్యూస్ జనగామ , 06 డిసెంబర్ :జనగాం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.కె.మల్లిఖార్జున రావుతో కలిసి శనివారం వీడియో సమావేశం ద్వారా అసంక్రమణీయ వ్యాధుల నియంత్రణ కార్యక్రమం మరియు ఇతర జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో రక్తపోటు, మధుమేహం,ప్రధాన క్యాన్సర్ల స్క్రీనింగ్ పురోగతిని సమీక్షించి,అర్హులైన ప్రజలందరికీ శాతం 100 స్క్రీనింగ్ పూర్తిచేయాలని ఆదేశించారు.అసంక్రమణీయ వ్యాధుల పోర్టల్‌లో డేటా నమోదులు,అనుసరణ,రిఫరల్ అనుసంధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతా గుర్తింపు సంఖ్య(ఆభా ఐడి)సృష్టి,టెలీ మెడిసిన్ సేవల వినియోగం,డిజిటల్ ఆరోగ్య రికార్డుల నవీకరణను వేగవంతం చేయాలని ఆదేశించారు.క్షేత్రస్థాయి కార్యకలాపాలపై పర్యవేక్షణ పెంచి,నివేదికలు సకాలంలో పంపేలా చర్యలు చేపట్టాలని సూచించారు.రక్తపోటు,మధుమేహం మందులు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.ఇతర జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన క్షయవ్యాధి నియంత్రణ,కేసుల గుర్తింపు,నోటిఫికేషన్,చికిత్స అనుసరణపై సమీక్ష చేపట్టారు.అలాగే జాతీయ వాహకజనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం కింద మలేరియా,డెంగీ వంటి ఋతుపవన వ్యాధుల నియంత్రణకు అవసరమైన చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు.అసంక్రమణీయ వ్యాధుల పోర్టల్,ఆరోగ్య సమాచార నిర్వహణ వ్యవస్థలో రియల్ టైమ్ డేటా సకాలంలో నవీకరించాలన్నారు.ప్రజారోగ్య సూచికల మెరుగుదల కోసం అన్ని విభాగాలు సమన్వయంతో,కట్టుదిట్టంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లాలోని కార్యక్రమాధికారులు,వైద్యాధికారులు,ఇతర ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ సర్పంచుల గెలుపు కోసం
# విస్తృత ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు

- మన గ్రామ అభివృద్ధి మన చేతుల్లోనే ఉంది..
- గ్రామ అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలి
- ఇతర పార్టీల అభ్యర్థులు గెలిస్తే గ్రామ అభివృద్ధి ఆగిపోతుంది
- డబ్బులు, మద్యానికి ఆశపడవద్దు గ్రామాన్ని ఆగం చేసుకోవద్దు
- గ్రామం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించాలి



తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/డిసెంబర్ 6:వరంగల్ జిల్లా:వర్ధన్నపేట మండల పరిధిలోని చెన్నారం, కాశగూడెం, ఉప్పరపల్లి, నల్లబెల్లి గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆయా గ్రామాలలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమూద్ ఆయుబ్ వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ..



గ్రామం అభివృద్ధి చెందాలన్నా, గ్రామ సమస్యలు పరిష్కారం కావాలన్నా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను మాత్రమే గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఇంకా 3ఏళ్ళు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని, ఎమ్మెల్యే గా నేను ఉంటానని గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ఇతర పార్టీ అభ్యర్థులు గెలిస్తే, ప్రభుత్వం దగ్గరకు, ఎమ్మెల్యే దగ్గరకు రాలేదని, గ్రామంలో ఏ రకమైన అభివృద్ధి పనులు చేసేందుకు అవకాశం ఉండదని కావున గ్రామ ప్రజలు గ్రామ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలని కోరారు. ఇతర పార్టీల అభ్యర్థులు ఇచ్చే మద్యం, డబ్బులకు ఆశ పడి, వాళ్ళు చెప్పే మాయ మాటలు నమ్మి వారికీ ఓటు వేస్తే గ్రామంలో జరగాల్సిన అభివృద్ధి ఆగిపోతుందని తెలిపారు. ఈ ఎన్నికలు గ్రామ అభివృద్ధికి సంబందించిన ఎన్నికలని మన గ్రామ అభివృద్ధి మన చేతుల్లోనే ఉందని కావున పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలోనే ఎక్కడా లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. 25 లక్షల మంది రైతులకు 21వేల కోట్ల రుణ మాఫీ చేయడం, 9రోజుల్లో 9వేల కోట్లు రైతులకు పెట్టుబడి సాయం అందించడం ఒక చరిత్ర అని కొనియాడారు. సన్నాలకు 500రూపాయల బోనస్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలు చేస్తూ రైతులకు అండగా ప్రభుత్వం నిలబడుతుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ అవసరాలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు వంటి ప్రజా సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు.



గ్రామాలలో ఇందిరమ్మ ఇల్లు రావాలన్నా, సిసి రోడ్లు నిర్మాణం కావాలన్నా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమాలలో ఆయా గ్రామాల సర్పంచ్, వార్డు అభ్యర్థులు, మండల నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలు



తెలుగు గళం న్యూస్ జనగామ డిసెంబర్ 6:జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎన్నికల కోడ్) అమల్లోనే ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.మూడు దశల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో చివరి దశ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ కొనసాగుతుందన్నారు.ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామపంచాయతీల్లో కూడా ఎన్నికల కోడ్ యథాతథంగా అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు.రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చివరి దశ ఎన్నికల వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందన్నారు.ఎవ్వరూ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించవద్దని,ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.గ్రామపంచాయతీ ఎన్నికల చివరి దశ పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి,ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నాటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని,చివరి దశ ఫలితాలు వెలువడే వరకు అదే విధంగా కొనసాగుతుందని తెలిపారు.ఈ నెల 11,14,17 తేదీల్లో జిల్లాలోని గ్రామపంచాయతీలకు సర్పంచ్ మరియు వార్డు సభ్యుల ఎన్నికలు జరగనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

# ఎన్నికల విధులు చాలా కీలకం

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



తెలుగు గళం న్యూస్ జనగామ , 06 డిసెంబర్ :గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ లో భాగంగా లింఘాల ఘనపుర్ మండలం బండ్ల గూడెం రైతు వేదిక లో పి ఓ లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని శనివారం జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరిశీలించి పలు అంశాల మీద పి ఓ లకు కలిగిన అవగాహన ను కలెక్టర్ స్వయంగా ప్రశ్న లు అడిగి పరీక్షించారు.ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ...రీపోలింగ్ కి ఆస్కారం ఇవ్వకుండా ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ అన్నారు.ఎన్నికల విధులు చాలా కీలకమైనదని... ప్రతీ అంశం పైన క్షుణ్ణం గా అవగాహన కల్పించుకొని...విధులను నిర్వర్తించాలన్నారు.ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి సేకరించడం,అంత సామాగ్రి సరిగా ఉందో లేదో ఎలా సరిచూసుకోవడం,ఓటర్ లిస్ట్,బ్యాలెట్ పేపర్స్ చెక్ చేసుకోవడం ,బ్యాలెట్ బాక్స్ ఎలా సీల్ చేయాలి,ఛాలెంజ్ ఓటు,టెండర్ ఓటు,బ్యాలెట్ పేపర్స్ ఇవ్వడం,పిఓ డైరీ నింపడం,అన్ని ఫార్మ్స్ ఎలా నింపాలి,ఏజెంట్స్ సిగ్నేచర్ ఎక్కడ తీసుకోవాలి,పోలింగ్ పూర్తి అయిన తర్వాత బ్యాలెట్ బ్యాక్ సీలింగ్,ఓట్స్ కౌంటింగ్,ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహణ,సర్పంచ్,ఉపసర్పంచ్ నియామక పత్రాలు ఇవ్వడం ..తదితర అంశాల మీద పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.మాస్టర్ ట్రైనర్స్ కోటి,శ్యామ్ మోహన్,రాఘవులు,హరి ప్రసాద్,రాజ శంకర్ పోలింగ్ ముందు రోజు నుండి కౌంటింగ్ వరకు పి ఓ ల కార్యాచరణ,విధులు,బాధ్యత లు తీసుకోవలిసిన జాగ్రత్త లను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు.ఈ కార్యక్రమం లో మండల తహసీల్దార్,ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.



# మైక్రో అబ్జర్వర్లు కీలక పాత్ర పోషించాలి

**పారదర్శకంగా ఎన్నికలు జరగాలి- ఎన్నికల పరిశీలకులు రవికిరణ్ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

తెలుగు గళం న్యూస్ జనగామ డిసెంబర్ 6 :గ్రామ పంచాయతీ సర్పంచ్,వార్డు సభ్యుల సాధారణ ఎన్నికలను పూర్తిగా స్వేచ్ఛాయుత,నిష్పక్షపాత మరియు పారదర్శక వాతావరణంలో నిర్వహించాలని ఎన్నికల పరిశీలకులు రవికిరణ్,జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మైక్రో అబ్జర్వర్లకు సూచించారు.శనివారం జనగాం జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి జనరల్ అబ్జర్వర్ రవికిరణ్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హాజరై మార్గనిర్దేశనం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు.ఎలాంటి పక్షపాతం లేకుండా నైతిక విలువలతో విధులు నిర్వర్తించాలని



సూచించారు.మైక్రో అబ్జర్వర్లు తమ చెక్‌లిస్ట్‌లో ప్రతి అంశాన్ని"అవును/కాదు"రూపంలో నమోదు చేసి,ఏవైనా లోపాలు లేదా సంఘటనలు గమనిస్తే ప్రత్యేక నివేదిక రూపంలో అందజేయాలన్నారు.పోలింగ్ స్టేషన్‌లో బ్యాలట్ బాక్స్‌ను సరిగ్గా ఫిక్స్ చేయాలని,ఎంట్రీ పాస్ సిస్టమ్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు.ఓటర్ల గుర్తింపు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జరగాలని,ఇండెలిబుల్ ఇంక్ సరైన విధంగా అప్లై చేయాలని,బ్యాలెట్ పేపర్ కౌంటర్ ఫాయిల్‌లో ఓటర్ల వివరాలు నమోదు చేయాలని తెలిపారు.పోలింగ్‌లో రహస్యత్వం పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలని ఆదేశించారు.పోలింగ్ ఏజెంట్ల ప్రవర్తనపై నిఘా ఉంచాలని,వారి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు.గ్రామ పంచాయతీ కౌంటింగ్ సెంటర్స్‌లో ఏర్పాట్లు పరిశీలించి, కౌంటింగ్ ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారం జరిగేలా



చూడాలన్నారు. ఫలితాల ప్రకటన,ఎన్నికల సర్టిఫికెట్ల జారీ సక్రమంగా జరగాల్సిందేనని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జనరల్ అబ్జర్వర్ రవికిరణ్ మాట్లాడుతూ..పోలింగ్ ఏజెంట్ల హాజరు,కార్యకలాపాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.పోలింగ్ స్టేషన్లలో అనవసర రద్దీ లేకుండా యాక్సెస్ నియంత్రణ చేపట్టాలని,కౌంటింగ్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా జరిపి, వీడియో రికార్డింగ్, ప్రోటోకాల్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు.ఫలితాల అనంతరం నిర్వహించే ఉపసర్పంచ్ ఎన్నికను తెలంగాణ పంచాయతీ రాజ్ నిబంధనల ప్రకారం నిర్వహించాలని



సూచించారు.మైక్రో అబ్జర్వర్లు తప్పనిసరిగా పోలింగ్ టీమ్‌లతో కలిసి సమయానికి పోలింగ్ స్టేషన్లు, రిసెప్షన్ సెంటర్లకు చేరుకోవాలని తెలిపారు.పోలింగ్ స్టేషన్‌లో అవసరమైన కనీస సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా లేదా అన్నది పరిశీలించి ధృవీకరించాలన్నారు.ఎట్టి పరిస్థితుల్లోనూ మైక్రో అబ్జర్వర్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ లేదా పోలింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించకూడదని స్పష్టం చేశారు.శిక్షణలో మాస్టర్ ట్రైనర్ మెరుగు రామరాజు మైక్రో అబ్జర్వర్లకు బ్యాలట్ బాక్స్ పరిశీలన,సీరియల్ నంబర్ల నమోదు,మార్క్డ్ కాపీ ఆఫ్ ఎలక్టోరల్ రోల్ తయారీ,పోలింగ్ కేంద్ర ప్రవేశ నియంత్రణ,ఓటర్ల గుర్తింపు,ఇండెలిబుల్ సిరా అప్లై చేయడం,ఓటర్ల నమోదు ప్రక్రియలు, వికలాంగులు,వృద్ధులకు సహాయం,పోలింగ్ కేంద్రాల చుట్టూ అనుచిత ప్రచారం లేదా ఒత్తిడులపై నిఘా వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు.పోలింగ్ సమయంలో ఏవైనా అంతరాయాలు,ఘర్షణలు,ఫిర్యాదులు వచ్చినపుడు వాటిని వెంటనే జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లే విధానం,పోలింగ్ ముగిసిన తరువాత బ్యాలట్ బాక్స్ సీలింగ్,ఎన్నికల సామగ్రి రవాణా,బ్యాలెట్ పేపర్ అకౌంట్ తయారీ,ఏజెంట్లకు కాపీల పంపిణీ అంశాలపై కూడా స్పష్టత ఇచ్చారు.కౌంటింగ్ సమయంలో మైక్రో అబ్జర్వర్ల పర్యవేక్షణ బాధ్యతలు, ఫలిత పత్రాల సిద్ధతపై మార్గదర్శకాలు అందించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ మాధురి షా,ఇంచార్జ్ డీపీఓ వసంతతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 2026 ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ డ్రా విడుదల.. అల్జీరియాతో అర్జెంటీనా ఫస్ట్ మ్యాచ్



స్పోర్ట్స్ న్యూస్, 06 డిసెంబర్ (తెలుగు గళం): వచ్చే ఏడాది ఫిఫా ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ జరగనున్నది. దీని కోసం వాషింగ్టన్ డీసీలో తుది డ్రా చేశారు. ఆ కార్యక్రమంలో ట్రంప్ పాల్గొన్నారు. మొత్తం మూడు దేశాలు వచ్చే ఏడాది ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ నిర్వహించనున్నాయి. అమెరికా, కెనడా, మెక్సికో దేశాల్లో ఆ మ్యాచ్‌లు ఉంటాయి. మొత్తం 48 దేశాలు వరల్డ్‌కప్‌లో తలపడనున్నాయి. 2026 జూన్ 11వ తేదీన టోర్నీ ప్రారంభంకానున్నది. మొత్తం 104 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. గత చాంపియన్ అర్జెంటీనా తమ టైటిల్‌ను డిఫెండ్ చేసుకునేందుకు ట్రై చేయనున్నది. మేటి ప్లేయర్ లియోనల్ మెస్సీకి చెందిన అర్జెంటీనా తన తొలి మ్యాచ్‌లో అల్జీరియాతో తలపడనున్నది. కేప్ వర్డీ, కురకావో, జోర్డాన్, ఉజ్బెకిస్తాన్ దేశాల్లో తమ గ్రూపు ప్రత్యర్థులు ఎవరో తెలుసుకున్నారు. నాలుగు సార్లు చాంపియన్‌షిప్ గెలిచిన జర్మనీతో కురకావో తన ఫస్ట్ మ్యాచ్‌లో పోటీపడనున్నది.

టోర్నమెంట్ ఓపెనింగ్ మ్యాచ్‌కు మెక్సికో వేదిక కానున్నది. మెక్సికో సిటీలో ఉన్న అజ్‌టెకా స్టేడియంలో ఫస్ట్ మ్యాచ్ ఆడనున్నారు. గ్రూపు ఏలో జూన్ 11వ తేదీన దక్షిణాఫ్రికాతో ఆ మ్యాచ్ ఉండనున్నది. ఇప్పటికే టోర్నీలో పాల్గొనే 42 జట్లు ఖరారు అయ్యాయి. ఇక ప్లేఆఫ్స్ లో ఉన్న ఆరు బెర్తుల కోసం 22 జట్లు పోటీపడనున్నాయి. వాటి ఫలితాలు మార్చి 31వ తేదీ వరకు తెలుస్తుంది. క్వార్టర్ ఫైనల్స్ నుంచి అన్ని మ్యాచ్‌లను అమెరికాలో నిర్వహించనున్నారు. జూలై 19వ తేదీన న్యూజెర్సీలోని ఈస్ట్ రూథర్‌ఫోర్డ్ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ జరగనున్నది.

1966లో వరల్డ్‌కప్ టైటిల్ గెలిచిన ఇంగ్లండ్ ఈసారి తన ఫస్ట్ మ్యాచ్‌లో క్రొయేషియాతో ఆడనున్నది. గ్రూప్ ఎల్‌లో ఘనా, పనామా దేశాలు కూడా ఉన్నాయి. ఈసారి మొత్తం 12 గ్రూపుల్లో జట్లు పోటీపడనున్నాయి. ఒక్కొక్క గ్రూపులో నాలుగేసి జట్లు ఉంటాయి.

# టీమిండియాకు గుడ్‌న్యూస్.. దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్ ఆడేందుకు CoE గ్రీన్ సిగ్నల్..




స్పోర్ట్స్ న్యూస్, 06 డిసెంబర్ (తెలుగు గళం): దక్షిణాఫ్రికాతో జరుగనున్న టీ20 సిరీస్‌లో టీమిండియా టెస్ట్, వన్డే జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అందుబాటులో ఉండనున్నాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్ట్‌లో మెడ గాయం కారణంగా టెస్ట్‌లతో పాటు వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో రీహాబిలిటేషన్‌లో కెప్టెన్ తాజాగా పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. గిల్ అన్ని ఫార్మాట్లలో ఆడేందుకు పూర్తిగా సిద్ధమయ్యాడని వైద్యులు ప్రకటించారు. గిల్ పోటీ క్రికెట్‌లోకి తిరిగి వచ్చేందుకు అవసరమైన అన్ని ఫిట్‌నెస్, ప్రమాణాలను పూర్తి చేసినట్లు తెలిపారు.

అతను కోలుకునే ప్రక్రియను వైద్యులు నిశితంగా పరిశీలించారు. ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని నివేదించారు. శుభ్‌మన్ గిల్‌ను అధికారికంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి విడుదల చేయనున్నారు. డిసెంబర్ 9 నుంచి దక్షిణాఫ్రికాతో జరుగనున్న ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌కు ఎంపిక చేసిన జట్టులో శుభ్‌మన్ గిల్‌కు చోటు దక్కిన విషయం తెలిసిందే. ఫిట్‌నెస్ క్లియరెన్స్ వస్తేనే టీ20 సిరీస్‌కు అందుబాటులో ఉంటాడని సెలక్షన్ సమయంలో బీసీసీఐ స్పష్టం చేసింది. తాజాగా ఫిట్‌నెస్ సాధించడంతో ఇక టీ20 సిరీస్‌లో కనిపించనున్నాడు.

గిల్ దక్షిణాఫ్రికాతో జరిగిన కోల్‌కతా టెస్ట్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తున్న సమయంలో గాయం కారణంగా రిటైర్ హర్ట్‌గా వెనుదిరిగాడు. ఆ మ్యాచ్‌లో ఆడలేకపోయాడు. రెండి టెస్టుతో పాటు వన్డే సిరీస్‌కు సైతం దూరమయ్యాడు. ఈ వారం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లోకి చేరుకున్నాడు. ప్రస్తుతం భారత్, దక్షిణాఫ్రికా జట్లు మూడు వన్డేల సిరీస్‌లో తలపడుతున్నాయి. రాంచీలో భారత్, రాయ్‌పూర్ వన్డేలో విజయం సాధించి ఈ సిరీస్‌లో 1-1తో సమానంగా ఉన్నాయి. శనివారం విశాఖపట్నం వేదికగా మూడో వన్డే జరుగునున్నది. ఈ నిర్ణయాత్మక మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను కైవలం చేసుకోవాలని రెండు జట్లు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా.. డిసెంబర్ 9 నుంచి టీ20 సిరీస్ ప్రారంభం కానున్నది. తొలి మ్యాచ్ కటక్‌లో, డిసెంబర్ 11న న్యూ చండీగఢ్‌లో రెండో మ్యాచ్.. మిగతా మూడు మ్యాచులు 14న ధర్మశాల, 17న లక్నో, 19న అహ్మదాబాద్‌లో రెండు జట్లు తలపడనున్నాయి.

# వరల్డ్ కప్ ఫైనల్‌లో అదరగొట్టిన షెఫాలి వర్మ.. ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు నామినేట్




స్పోర్ట్స్ న్యూస్, 06 డిసెంబర్ (తెలుగు గళం): వరల్డ్ కప్ ఫైనల్‌లో అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్న భారత క్రీడాకారిణి షఫాలి వర్మ నవంబర్ నెలకు ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు నామినేట్ అయ్యారు. ప్రతీకా రావల్ గాయం కారణంగా సెమీఫైనల్స్‌కు ముందు వర్మను భారత జట్టులోకి తీసుకున్నారు. కానీ షఫాలి తన మొదటి మ్యాచ్‌లో ప్రభావం చూపలేకపోయింది. అయితే, దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్లో వర్మ 78 బంతుల్లో 111.53 సగటుతో 87 పరుగులు చేసి, భారత్ 298/7 స్కోరును సాధించడంలో కీ రోల్ ప్లే చేసింది. బౌలింగ్ లోనూ ప్రత్యర్థి జట్టుపై విరుచుకుపడి ఏడు ఓవర్లలో 36 పరుగులకు సునే లూస్, మారిజాన్ కాప్ ల కీలక వికెట్లను పడగొట్టింది.

వర్మ ఆల్ రౌండ్ పర్ఫామెన్స్ తో భారతదేశం ఫైనల్‌ను 52 పరుగుల తేడాతో గెలిచి తమ తొలి ప్రపంచ కప్ టైటిల్‌ను గెలుచుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ఇషా ఓజా, థాయిలాండ్‌కు చెందిన తిపాచా పుట్టావోంగ్‌లతో పాటు షెఫాలి వర్మ నామినేట్ అయ్యారు. ఐసిసి ఉమెన్స్ ఎమర్జింగ్ నేషన్స్ ట్రోఫీ సందర్భంగా ఓజా మరోసారి తన మ్యాచ్ విన్నింగ్ ప్రతిభను ప్రదర్శించింది. ఈ నెలలో జరిగిన ఏడు టి20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో, ఆమె 137.50 స్ట్రైక్ రేట్‌తో 187 పరుగులు చేసింది.

వర్మ బంతితో కూడా బాగా రాణించింది, 18.14 సగటుతో ఏడు వికెట్లు పడగొట్టడం ద్వారా తన ఆల్ రౌండ్ సామర్థ్యాలను ప్రదర్శించింది. థాయిలాండ్ ఎడమచేతి వాటం స్పిన్నర్ తిపాచా పుట్టవాంగ్ కూడా అద్భుతంగా రాణించింది. ఆమె తన జట్టు ఐసీసీ ఉమెన్స్ ఎమర్జింగ్ నేషన్స్ ట్రోఫీని గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించింది. టోర్నమెంట్‌లో 15 వికెట్లతో సంయుక్తంగా అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచింది.

# లండన్ చెస్ చాంపియన్ ప్రజ్ఞానంద



స్పోర్ట్స్ న్యూస్, 06 డిసెంబర్ (తెలుగు గళం): భారత యువ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద రమేశ్‌బాబు వచ్చే ఏడాది జరుగబోయే క్యాండిడేట్స్ చెస్ టోర్నీకి అర్హత సాధించేందుకు మరింత చేరువయ్యాడు. లండన్ వేదికగా బుధవారం రాత్రి ముగిసిన లండన్ చెస్ క్లాసిక్ 2025 ఓపెన్‌లో అతడు.. సెర్బియాకు చెందిన వెలిమిర్ ఇవిక్‌తో కలిసి సంయుక్తంగా విజేతగా నిలిచాడు.

కొద్దిరోజుల క్రితమే స్వదేశంలో జరిగిన చెస్ ప్రపంచకప్‌లో నాలుగో రౌండ్‌కే వెనుదిరిగిన ప్రజ్ఞానంద.. లండన్ చెస్ క్లాసిక్‌లో మాత్రం పూర్తిస్థాయి ఆధిపత్యం ప్రదర్శించాడు. ఈ టోర్నీలో వరుసగా మూడు గేమ్స్ గెలిచిన అతడు.. తర్వాతి మ్యాచ్‌లను డ్రా చేసుకున్నాడు. తొమ్మిది రౌండ్లుగా సాగిన ఈ టోర్నీలో ప్రజ్ఞానందతో పాటు వెలిమిర్, అమీత్ ఘాషి (ఇంగ్లండ్) ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోకుండా 7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు.

# సినిమా న్యూస్


## పెళ్లి తర్వాత సమంత మరో షాకింగ్ నిర్ణయం !



టాలీవుడ్ అగ్ర హీరోయిన్ సమంత ఇటీవల పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే రెండో వివాహం చేసుకున్న తర్వాత సమంత షాకింగ్ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. పెళ్లి తర్వాత రాజ్ నిడిమోరు, హీరోయిన్ సమంత హనీమూన్ వెకేషన్ కు వెళ్తానని అందరూ అనుకున్నారు. కానీ చివరి నిమిషంలో ట్విస్ట్ ఇచ్చింది ఈ జంట. తన తదుపరి ప్రాజెక్టుపై ఫోకస్ పెట్టేందుకు సమంత కీలక నిర్ణయం తీసుకుంది.

ఇందులో భాగంగానే షూటింగ్ కోసం మేకప్ అవుతున్న ఫోటోను తాజాగా షేర్ చేసింది. ఈ ఫోటోకు లెట్స్ డూ దిస్ అనే క్యాప్షన్ కూడా ఇచ్చింది సమంత. అటు సెట్స్ లో ఉన్న ఫోటోలను కూడా పంచుకుంది. దీంతో సమంత-రాజ్ నిడిమోరు హనీమూన్ క్యాన్సల్ అయిందని అంటున్నారు. కెరీర్ పైన దృష్టి పెట్టేందుకు సమంత దంపతులు ఈ నిర్ణయం తీసుకున్నారట. కాగా సొంత నిర్మాణంలో సమంత ప్రధాన పాత్ర పోషిస్తున్న మా ఇంటి బంగారం షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. ఇందులో ఈ మూవీకి నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే.

## సుకుమార్ సినిమా మొదలయ్యేది అప్పుడే?



రామ్‌చరణ్ 'పెద్ది' సినిమా వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానున్న విషయం తెలిసిందే. అదే నెలలో రామ్‌చరణ్-సుకుమార్ సినిమా కు సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు కూడా మొదలు పెడతారట. 2026 మే నుంచి షూటింగ్‌ను ప్రారంభించాలనేది సుకుమార్ ప్లాన్ అని తెలుస్తున్నది. రామ్‌చరణ్ మాత్రం 'పెద్ది' రిలీజ్ తర్వాత ఓ రెండు నెలలు విరామం తీసుకొని సుకుమార్ సినిమా సెట్‌లోకి ఎంట్రీ ఇస్తారట. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ఫైనల్ స్క్రిప్ట్‌ని కూడా సుకుమార్ లాక్ చేశారు.

'సుకుమార్ నెక్ట్స్ సినిమాలోని హీరో ఎంట్రీ సీన్ కోసం ఎదురు చూస్తున్నా' అని ఆ మధ్య ఓ వేదికపై రాజమౌళి అన్నారు. సూచాయగా అయినా కథ తెలియకపోతే రాజమౌళి ఆ మాట అనరు అనేది అభిమానుల మాట. దీన్నిబట్టి ఈ సినిమా రేంజ్‌ను అర్థం చేసుకోవచ్చు. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు త్వరలోనే తెలియనున్నాయి.


## బాలయ్య ఫ్యాన్స్ కు మరో షాక్... ఈ ఏడాది అఖండ 2 కష్టమేనా?




నందమూరి బాలయ్య నటించిన ఆఖండ 2 సినిమాకు లైన్ క్లియర్ కావడం లేదు. మొన్నటి నుంచి ఈ సినిమా రిలీజ్ పైన ఎలాంటి క్లారిటీ రావడం లేదు. 14 రీల్స్ ప్లస్ పాత బకాయిల నేపథ్యంలో ఈ సినిమా అర్ధాంతరంగా వాయిదా పడింది. దీంతో నందమూరి బాలయ్య అభిమానులు డీలా పడిపోయారు. అయితే ఈ పెద్ద తప్పిదం పట్ల తాజాగా 14 రీల్స్ ప్లస్ స్పందిస్తూ పోస్ట్ కూడా పెట్టింది. నందమూరి బాలయ్య అభిమానులకు క్షమాపణలు చెప్పింది. అతి త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని వెల్లడించింది.

అయితే ఈ నేపథ్యంలో అఖండ 2 వచ్చే సంవత్సరంలోనే రిలీజ్ కాబోతున్నట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. బుక్ మై షోలో 2026 లోనే అఖండ 2 రిలీజ్ అని చూపిస్తోందట. దీంతో ఈ ఏడాది కష్టమేనని ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే మరికొంతమంది మాత్రం డిసెంబరు 12వ తేదీ లేదా 25వ తేదీలలో రిలీజ్ చేసే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ రెండు తేదీలు మిస్ అయితే, సంక్రాంతి బరిలో అఖండ 2 ఉండనుంది. ఆ సమయంలో సినిమా రిలీజ్ అయితే, కలెక్షన్స్ భారీగా తగ్గే ప్రమాదం పొంచి ఉన్నట్లు సినిమా విశ్లేషకులు చెబుతున్నారు. క్రిస్మస్ కానుకగా రిలీజ్ చేస్తే బాగుంటుందని సూచనలు చేస్తున్నారు. ఇక అటు సినిమా వాయిదా పడడంపై నందమూరి బాలయ్య చాలా సీరియస్ గా ఉన్నట్లు చెబుతున్నారు.

## వరలక్ష్మీ శరత్ కుమార్ 'పోలీస్ కంప్లెయింట్'



వరలక్ష్మీ శరత్ కుమార్, నవీన్ చంద్ర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పోలీస్ కంప్లెయింట్'. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను ఎంఎస్కే ప్రమిద శ్రీ ఫిల్మ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మిస్తున్నారు. ఇటీవల షూటింగ్ పూర్తి చేసుకున్న సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. విడుదలకు సిద్ధమవుతోంది. తెలుగుతోపాటు పలు భాషల్లో విడుదల కానున్న చిత్రంలో సూపర్ స్టార్ కృష్ణపై స్పెషల్ సాంగ్ ఉండబోతుందని.. ఈ చిత్రానికే హైలెట్ కానుందని చెప్తున్నారు మేకర్స్. ఇక ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్న డైరెక్టర్.. 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌పై 'పోలీస్ కంప్లెయింట్' సినిమా నడుస్తుందని.. మనం చేసే ప్రతి చర్య తిరిగి మనకే ఫలితంగా వస్తుందన్న భావనను హారర్ థ్రిల్లర్‌గా కొత్త కోణంలో చూపించనున్నట్లు చెప్పారు. చిత్రయూనిట్ అందరి సపోర్టుతో షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేశామని.. సినిమా అవుట్ పుట్ బాగా వచ్చిందని తెలిపారు. ప్రేక్షకులకు సరికొత్త థ్రిల్లింగ్ అనుభూతిని ఇవ్వబోతుందని చిత్ర యూనిట్ చెబుతోంది.

## మరోసారి పెళ్లి వార్తలు.. క్లారిటీ ఇచ్చిన మీనాక్షి చౌదరి టీమ్!



టాలీవుడ్ యువ కథానాయిక మీనాక్షి చౌదరి, అక్కినేని హీరో సుశాంత్‌లు త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నట్లు మళ్లీ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై మరోసారి స్పందించింది మీనాక్షి బృందం. గత కొంతకాలంగా వీరిద్దరూ ప్రేమలో ఉన్నారంటూ వస్తున్న ఊహాగానాల్లో ఎలాంటి వాస్తవం లేదని టీమ్ తెలిపింది. మీనాక్షి చౌదరి, సుశాంత్ త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలోని కొన్ని మీమ్ పేజీలు, వెబ్‌సైట్లు రెండు రోజులుగా మళ్లీ వార్తలను వైరల్ చేస్తున్నాయి. వచ్చే ఏడాది వీరి పెళ్లి అంటూ ఫొటోలు సైతం షేర్ చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు ఖండించిన మీనాక్షి, తాజాగా ఈ రూమర్స్‌పై తన టీమ్ ద్వారా మరోసారి వివరణ ఇప్పించారు. కాగా, వీరిద్దరూ కలిసి 'ఇచట వాహనములు నిలుపరాదు' అనే చిత్రంలో నటించారు. ఆ సినిమా నుంచే వీరి మధ్య మంచి స్నేహం ఏర్పడినట్లు సమాచారం.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.